# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 11

పేజీలు 40

జులై 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** .............................. ....... **పేజీ**


భద్రవాక్యం ........................................2
శ్రీబాబూజీ ఉవాచ..................................3
అమ్మమాట..........................................5
ఆత్మనివేదన ......................................7
బంగారు క్షణాలు ................................9
సన్నిధిలో సంభాషణ ............................11
యోగవాశిష్ఠము ..................................13
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..........................15
పరిప్రశ్నేన సేవయా..............................16
ముక్కోటి దేవతలు ఒక్కటైనారు....................... 17
గీతాధ్యయనమ్..................................18
శ్రీకృష్ణకర్ణామృతము..............................20
వృక్షరాజమా!....................................22
అమృతబిన్దూపనిషత్ ..........................23
శ్రీసద్గురు యాత్ర దర్శన్.......................25
సమత ............................................26
రాజమండ్రి శాఖ ..............................27
యెస్.హె.చ్.కె.వి.పి.బి.టి.ఆర్ స్కూల్......29
సేవ నహ్వా.......................................30
సత్సంగామృతం...................................32
గోదావరి పుష్కర కార్యక్రమాలు ...............34
సర్వం విష్ణుమయం జగత్ ....................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర..........37
విష్ణు కథలు– భక్త కబీర్‌దాస్................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వన్తికే।
తదన్తరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః॥
(ఈశావాస్యోపనిషత్ -5)

ఆత్మ లౌకిక దృష్టికి, చలించే బుద్ధికి తెలియబడదు కదా! అందువలన అజ్ఞానంలో ఆ ఆత్మ ఎక్కడో తనకి అందనంత దూరంలో ఉన్నట్లు భావన చేయటం సహజమే. అయితే ఆత్మ సాధకులందరికి అంత ఎందుకు ప్రాణులందరికి నిష్పక్షపాతంగా అనుభూతిని అందించటానికి దగ్గరగానే ఉన్నది సుమా!

జీవుడు తన జీవన విధానంలో అవగాహన లేకపోయినా 'నేను తింటున్నాను', 'నేను చూస్తున్నాను', 'నేను వింటున్నాను' అనే క్రియలు చేస్తూ ఆ క్రియలకు ఆధారమైన 'నేను' అనే ఆత్మను అనుసరిస్తూనే ఉన్నాడు. కాని 'నేను' అనే ఆత్మ వస్తువు జరిగే క్రియలకు విలక్షణంగా ఉంటూ క్రియకి ఆధారమవుతోంది. అంతేకాదు ఆత్మవస్తువు క్రియ ద్వారా పొందిన దుఃఖానికిగాని, సుఖానికి గాని చలించదు. పరిణామము చెందదు. కాని జీవుడు 84లక్షల జీవ రాసుల గర్భాలలో పుట్టుచు గిట్టుచు వివిధ ఉపాధులకు 'నేను' అనే ఆత్మవుస్తవును ఆరోపించినా అది మార్పుచెందనిది, స్థిరమైనది, పరిణామము లేనిది. అంతేకాదు 'నేను' అనే ఆత్మవస్తువులో ఇంద్రియ చేష్టలను, అహంకార అభిమానాలను, కీర్తి ప్రతిష్ఠలను ఆరోపించి, ప్రవర్తించినా 'నేను' అనేది చలించేది కాదు.

జీవుడు అభిమానించిన క్రియలుగాని, గుణాలుగాని, పదవులుగాని, సుఖదుఃఖాలుగాని, అన్నింటిని వదిలివేస్తున్నాడు కదా! తాను ఎంతో అభిమానించిన ఉపాధిని కూడా వదలక తప్పటం లేదు. జీవుడు ఎన్ని జన్మలెత్తినా దేహేంద్రియాదులతో ఎన్ని అనుభవించినా అవన్నీ 'నేను'కి దూరంగానే ఉంటున్నాయి. ఏ ఒక్కటీ 'నేను'ను బంధించ లేదుకదా! పరిపక్వ స్థితిలో ఉన్న సాధకునికి కూడా జన్మపరంపరలో పొందిన అనుభవాలన్నీ  దూరంగానే ఉంటున్నాయి. సందేహం లేదు. అటువంటి ప్రత్యక్షానుభూతితో జీవించే నరుని కర్మ బంధిస్తుందా? లేక కర్మ బంధనకి లోబడే స్థితిలో ఉంటాడా? అటువంటి వ్యక్తికి వర్తింపజేసే శ్లోకమే 'న కర్మలిప్యతే నరే' 'నాన్యథేతోస్తి'. వాటిని కాదనగలవారెవరు?

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "కొందరు ఆత్మ వస్తువు అచలము అంటున్నారు మరి కొంతమంది చైతన్యము తప్పకుంది అంటారు. ఇందులో ఏది యదార్థమైనది అని మన పండితులు సందేహం లేవదీశారు. బాగానే ఉంది. తెలుసుకోవాలనే సదుద్దేశంతో అడిగితే దానికి తగిన సమాధానం వస్తుంది కాని ఆ ప్రశ్నని 'నేను పండితుడిని' అన్న అహంకారముతో వేస్తే అటువంటి వారికి మా జగజ్జనని తగిన సమాధానం చెబుతుంది.



చైతన్యము లేక ఆత్మవస్తువు రూపనామ క్రియా రహితమైనది. అది కదిలేదికాదు. అది అంతటా వ్యాప్తమై ఉన్నది. కదలటానికి ఖాళీలేదు. అందువలననే దానిని అచలముఅన్నారు.

అచలము అంటే జడమైనది అని అపార్థం చేసుకోకండి. చైతన్యము సర్వసృష్టికి ఆధారమైనది. అది అన్నింటిని కదుల్చుతుంది గాని అది కదలదు. జీవకోటి ఉపాధి అశాశ్వతమైనది, నశించేది కాని దానిని ప్రకాశింపచేసే చైతన్యము శాశ్వతమైనది.

నా బాల్యంలో కొంతమంది పండితులంతా చేరి నన్ను ఏదోరకంగా అవమానపరచాలని ప్రయత్నం చేశారు. నన్ను ఆహ్వానించారు నాకు కూర్చోటానికి కుర్చీ ఏర్పాటు చేసారు. ఆ కుర్చీలో నన్ను కూర్చోమన్నారు. నేను వారందరికి నమస్కరించి మీరంతా నన్ను గౌరవించి ఒక ఉన్నత స్థానాన్ని ఇచ్చి కూర్చోమని అభ్యర్థించారు కాబట్టి మీ అభ్యర్థనను గౌరవించే దృష్టితో కుర్చీలో

కూర్చుంటున్నాను. మీరంతా చదువుకున్నవారు పండితులు మీరంతా నాకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతలు. నాకు మీరు గురుస్థానాన్నిచ్చారు. సద్గురుమూర్తి అంటే ఎవరో తెలుసా? జాగ్రదావస్థ అనే స్వప్నంలో కలలు కంటూ నిదురించే మానవుడిని మేల్కొలిపి తన నిజ జాగ్రదావస్థని గుర్తింపచేసేవాడు. మీరు నాకు అటువంటి సముచిత స్థానం ఇచ్చారు.

మీరంతా నన్ను శాస్త్ర సంబంధమైన ప్రశ్నలు వేద్దామని వచ్చారు. నేను మీ సందేహాలన్నీ తీర్చటానికి సిద్ధంగా ఉన్నాను. కానీ మీరంతా నా గురుత్వాన్ని అంగీకరిస్తే నా పాదాక్రాంతులవ్వాలి. దానికి అంగీకరించినపుడు నేను అడిగిన ప్రశ్నకి సమాధానము చెప్పవలసి ఉంటుంది. మీరు ఖండత్వములో ఉన్నారా? అఖండత్వంలో ఉన్నారా! మీరు ఖండత్వంలో ఉంటే మీ సందేహాలు తీర్చబడాలి అంటే నా పాదాలని ఆశ్రయించవలసిందే.

మీరు వేరొక గురుమూర్తిని ఆశ్రయించి ఉన్నట్లయితే మీ మనస్సు వేరొక గురుమూర్తికి అర్పించి ఉపాధిని ఇక్కడ నా సమక్షంలో ఉంచి ప్రశ్నిస్తే అది వ్యభిచారభక్తి అవుతుందేమో కదా!

పోనీ మీరు అఖండత్వములో ఉన్నారనుకుందాం. అప్పడు మీకు సందేహము కలగటానికి అవకాశము ఉండదు కదా! అన్నారు. పండితులంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని నిష్క్రమించారు. చూశారా! 'నేను పండితుడను' అనే అహంకారము ఏ స్థితికి తీసుకువెళ్తుందో! శ్రీ బాబూజీ మహరాజ్ తత్త్వ విచారణ చేసుకునే సద్గురుమూర్తిని తమ భాషా చాతుర్యంతో జయిద్దామనుకుంటారు" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## 'అవ్యక్తమ్ వ్యక్తిమాపన్నమ్'

'ఓం నమః ప్రణవార్ధాయ శుద్ధ జ్ఞానైక మూర్తయే ।
నిర్మలాయ, ప్రశాంతాయ - దక్షిణామూర్తయే నమః ॥'

సృష్టికంతటికీ ముందుగా ఆవిర్భవించినది ప్రణవం. మరి ఆ ఓంకారం రావడానికి కారణమేమిటి? ఆ కారణం గురువు. ఓంకారం ఆవిర్భవించిందీ అంటే అది గురువు వల్లనే వచ్చింది.

ఓంకారం లేని మంత్రం శిరస్సులేని మొండెం వంటిది. కానీ, 'నమః' అన్న పదం గురించి ఎవరైనా చెప్పారా? 'ఓం నమశ్శివాయ', 'ఓం నమో నారాయణాయ' - ఓంకారం తరువాత 'నమః' ఎందుకు పెట్టారంటే మనం ప్రపంచంలో ఉన్నాం కాబట్టి, ఆ అనంతశక్తి స్వరూపానికి 'నమస్కరిస్తున్నాను' అనే క్రియాపదాన్ని పెట్టారు.

ఓంకారానికి అధిష్ఠాన స్వరూపం మనమాశ్రయించిన గురు పాదమే. ఓంకారమందే నీ గురు స్థానముంది. ఓంకారానికీ, గురు మంత్రానికీ భిన్నత్వం లేదు. అందుకనే ధ్యానప్రక్రియ మొదలుపెట్టే ముందు ఓంకారాన్ని పూరించమని చెప్తారు. తెల్లవారుఝామునే లేచి, స్నానాదులు కావించుకుని, ధ్యానానికి కూర్చుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఓంకారం నాభి నుండి రావాలి. ఆ నాదం ఎక్కడి నుంచి వస్తోంది? తిరిగి ఎక్కడ లయిస్తోంది? నాభి నుండి మొదలై, ఊర్ధ్వముఖంగా ప్రయాణించి, తిరిగి 'మ్' అనే నాదం నాభిస్థానంలోనే కలిసిపోతుంది. అ-ఉ-మ అనే మూడు అక్షరాలు ఏకవర్ణంగానే పూరింపబడుతుంది. కళ్ళు తెరిస్తే ప్రపంచం కనిపిస్తుంది. కనుక, కళ్ళు మూసుకుని ప్రణవాన్ని హాయిగా పూరిస్తే ప్రశాంతంగా ఉంటుంది.

మనం ఇంతకుముందు పాడుకున్న ఆ దక్షిణామూర్తి శ్లోకం, శ్రీదక్షిణామూర్తి గురించి. సనక, సనందనాదులు జ్ఞానార్థమై త్రిమూర్తుల దగ్గరకు వెళ్తారు. కాని ఆ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల చర్యలను చూసి, వారు తమకి జ్ఞాన భిక్షను పెట్టలేరని సందేహించి వెళ్ళిపోతుండగా, వారికి అలౌకిక సౌందర్యంతో ఒప్పారుతున్న ఒక నవయువకుడు చిన్ముద్రను ధరించి, దక్షిణాభిముఖుడై, పద్మాసనంలో కూర్చుని దర్శనం ఇస్తాడు. ఆయనే దక్షిణామూర్తి స్వామి."ఓం అనే ప్రణవానికి అర్థమై ఉన్నవాడవు,

శుద్ధ జ్ఞాన స్వరూపుడు, నిర్మలుడు, ప్రశాంతుడు అయిన దక్షిణామూర్తి స్వామికి నమస్కారము" అని వారు స్తుతించారు. అక్కడ చూడబోతే జ్ఞానార్థమై వచ్చిన శిష్యులందరూ వృద్ధులు. గురుస్థానంలో ఉన్నాయన యువకుడు! కానీ వారు అదేమీ చూడలేదు. ఆ యువకుడి యొక్క నిర్మలత, ప్రశాంతత వారిని ఆకట్టుకున్నాయి. ఆయన కేవలం 'శుద్ధ జ్ఞానైక మూర్తి' అని వారి మనస్సులపై ముద్రించుకున్నారు. పోనీ ఆయన వీరికేమైనా నోరు విప్పి బోధ చేశారా? లేదు. ఆయనది 'మౌన వాఖ్య'. మనం ఎంతవరకు శ్రవణం చేయాలి అనే ప్రశ్నకి, 'నీవు అది అయ్యేవరకూ వినాలి' అన్నది జవాబు. 'నీవు పరమాత్మ స్వరూపం' అని గురుదేవులు చెప్పినా వినటం లేదు కదా! కానీ, నిరంతర మననశీలురు అయిన ఈ శిష్యులు నిజంగానే పండిపోయారు. వారిలో అహంకార మమకారాలనే పులుపు వగరులు మచ్చుకైనా లేవు. బ్రహ్మనిష్ఠులైన వారంతా దక్షిణామూర్తి స్వామి చుట్టూ కూర్చున్నారు. వయస్సు మళ్ళిన వారికి, మనసు నిలచిన చోటే ఆసనం అవుతోంది.

గురుదేవుని యొక్క మౌనవ్యాఖ్యతోనే పరబ్రహ్మ తత్త్వం ప్రకటితం అయింది. ఆచార్యేంద్రుడైన దక్షిణామూర్తి చిన్ముద్రను చేత ధరించి, హాయిగా, మౌనంగా, ఆనందంగా, ప్రసన్నంగా, ప్రశాంతంగా సమాధి స్థితులై ఉన్నారు. పండిపోయి ఉన్న ఆ శిష్యులందరూ కూడా ఆనంద స్వాంత భరితులైపోయారు. వారి సందేహాలన్నీ పటాపంచలైపోయాయి. కేవలం చిన్ముద్ర ద్వారా స్వామి వారికి బోధ చేశారు. (అదే 'కోడిభాష' అంటే 'కోడ్ లాంగ్వేజి' 'సాంకేతిక భాష' అనేవారు శ్రీబాబూజీ మహరాజ్)



చిన్ముద్ర అంటే మధ్యవ్రేలు, ఉంగరం వ్రేలు, చిటికెన వ్రేలుని ప్రక్కకు ఉంచి, చూపుడు వ్రేలుని, బొటన వ్రేలుతో కలిపి ఉంచటం అన్నమాట. బొటన వ్రేలు పరమాత్మ, చూపుడు వ్రేలు జీవాత్మకి, మిగతా మూడు వ్రేళ్ళూ సత్వ, రజ, స్తమో గుణాలకి సంకేతం. మూడు గుణాలని వదిలివేసిన నాడు, జీవాత్మ పరమాత్మతో ఏకస్వరూపాన్ని పొందుతాడు అని ఈ చిన్ముద్ర సూచిస్తుంది. ఆ ముద్రని చూడగానే శిష్యుల సందేహాలు పటాపంచలై పోయాయి.

- సశేషం

# ఆత్మ నివేదన

- మైలవరపు సుశీల

మా అమ్మగారికి వడాలిలో ఉన్న మా తాతయ్యగారు పెళ్లి సంబంధం చూడటం, నిశ్చయించటానికి ప్రయత్నాలు చేయటం జరిగింది. ఇంతలో శ్రీబాబు వడాలి వచ్చి "కామేశ్వరికి పెళ్లి సంబంధం నిశ్చయంచేద్దామనుకుంటున్నావు కాని అలా చేయకు. భవిష్యత్తులో ఇబ్బందులు పడతారు" అని హెచ్చరిక చేశారు. కానీ, మా తాతయ్య శ్రీబాబు హెచ్చరికను పెడచెవిని పెట్టారు. దానికి ప్రధాన కారణం పెండ్లికొడుకు అందగాడు, మంచి ఉద్యోగస్థుడు. అందువలన అతనితో వివాహం జరిగిపోయింది.

వివాహ అనంతరం మా నాన్నగారికి గుండెలో నొప్పి వచ్చేది. మా అమ్మ శ్రీబాబు దగ్గరకు వెడదాం రమ్మనమని ఎన్నిసార్లు బ్రతిమి లాడినా, మా నాన్నగారు 'మానవులు ఏం చేయగలుగుతారు?' అనేవారు. కాలక్రమేణ నలుగురు పిల్లలు సంసారంలోకి వచ్చారు. సంసారం ఎలా వృద్ధి చెందిందో , అలాగే వ్యాధి కూడా ముదిరి, ప్రమాద స్థాయికి చేరుకుంది. ఆ దశలో ఇహ మా నాన్నగారు శ్రీబాబూజీ దగ్గరకు రావటానికి అంగీకరించారు.

ఆ సమయంలో శ్రీబాబు భీమవరం తాతయ్యగారింట్లో ఉన్నారు. శ్రీబాబు మా నాన్నగారిని చూసి "అన్నం చిమిడి పోయింది. అయినా తీర్థ ప్రసాదాలు తీసుకుంటూ, భగవన్నామ స్మరణ చేసుకుంటూ ఉండండి. శాంతి చేకూరుతుంది" అన్నారు. మా నాన్నగారు అలాగే అంత్యకాలంలో భగవన్నామ స్మరణ చేసుకుంటూ దేహత్యాగం చేశారు.

శ్రీబాబు మా నలుగురి పిల్లల సంరక్షణ బాధ్యతను మా

బుల్లి తాతయ్యగారికి అప్పజెప్పి, "ఈ పిల్లలు ఉన్నంతవరకు నీ పంటలు బాగా పండి, సిరి సంపదలతో వర్ధిలుతావు!" అన్నారు. మేము నలుగురు పిల్లలం వడాలిలో ఉండేవాళ్ళం. మా అమ్మగారు మెట్రిక్ పాస్ అయి, భీమవరంలో మంచిరాజు సత్యనారాయణగారి వద్ద సంగీతం నేర్చుకున్నారు. శ్రీబాబు ఆజ్ఞ ప్రకారం ఆయన సంగీతం నేర్పించటానికి అంగీకరించారు. మా అమ్మకు సంగీతం నేర్పినందుకు, సంతానం లేని సత్యనారాయణ గారికి శ్రీబాబు సంతానాన్ని ప్రసాదించారు.

మా అమ్మగారు సంగీతంలో డిప్లమో పొందగలిగింది. ఉద్యోగం కూడా వచ్చింది. గురుదేవులు మా అమ్మ ఉద్యోగం చేయటానికి అంగీకరించ లేదు. "ఉద్యోగం చేస్తే నీలో ఉన్న తత్త్వం మరుగున పడి పోతుంది. త్యాగరాజు ఎన్నడూ ధనానికి అమ్ముడుపోలేదే! నిధి సుఖమా! రాముని సన్నిధి సుఖమా! అని మనస్సును ప్రశ్నించి, సముచిత నిర్ణయం తీసుకున్నాడు కనుకనే ఆయన పొందవలసిన స్థితిని పొందాడు" అని చేసిన గురుదేవుల హెచ్చరికను ఆధారం చేసుకుని, మా అమ్మగారు శ్రీ త్యాగరాజ కృతులు గానం చేసుకుంటూ గురుసన్నిధిలో కాలం వెళ్ళ దీసుకుంటున్నారు. మా అమ్మగారి జీవితమే మాకు అందరికీ ఆదర్శం!!



# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

ఆశ్రమంలో ఉదయంపూట భక్తులందరితో కలిసి సంకీర్తన చేసుకుంటూ వాకింగ్ చేసే సమయంలో శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్‌వారు భీమవరం శేషమ్మగారిచేత అచల సిద్ధాంత కందార్థ దరువులను, పద్యాలను, శ్రీలలితానంద సరస్వతిస్వామి (పూర్వ నామధేయం హనుమాయమ్మ గారు లేక గురువుగారు) చేత పద్యాలు, ఉపనిషత్తులు చెప్పించి తరువాత శ్రీవారు చేసిన బోధపూర్వక వివరణను ఇక్కడ అందజేస్తున్నాము.........

3-12-1979 -

శేషమ్మగారు -

ఆటాడి ఆడకుండును
ఆటాడిన మేట బొమ్మ యాటాడకనే
ఆటాడు నెరుక యనియెడి యాటాడించేటివాడు
అతడేరా కర్తా అంతటికీ ఈ యచలమా కర్తా

శ్రీ బాబు -

అవునమ్మా! ఆయన ఎప్పుడూ అకర్తే. ఈ బొమ్మలన్నీ తిరుగుతూ ఉంటాయి. కానీ ఆయన తిరగడు, కదలడు. ఆయన అచలుడు. రంగుల రాట్నం తిరుగుతూ ఉంటుంది. దానిని ఎక్కిన వారందరూ తిరుగుతూ ఉంటారు. కానీ దానిని నడిపేవాడు మాత్రం తిరగడు. ఆయనే లేకపోతే ఈ జీవులన్నీ కదలవు. ఆ త్రిప్పేవాడే భగవంతుడు. ఆ తిరుగుతున్నవారే జీవులు. ఆటాడిస్తాడు కానీ ఆయన ఆడడు. ఇంకొకటి చెప్పండి.

శేషమ్మగారు -

మంతనము గురుబోధన
యెంతో వింతనుచు నమ్మితింతే గదా
అని ధావంతము నొందేటి వాని
బ్రతుకంతా కంతే
చింతలు లేని గతిగాన డంతే
అంతకంతకు వాని కతి చాదస్తమే గాని
సంత కూటమి తోటి సంభాషించడు వాని
బ్రతుకంతా కంతే చింతలు లేని గతి గానడంతే॥

శ్రీ బాబు -

గురుదేవుడిచ్చిన మంత్రం విని, దాని విలువ తెలియని శిష్యుడు 'ఓస్! ఇంతేనా! ఈయన ఇంకా తెలియనది, కొత్తదేదో చెప్తాడనుకున్నా, ఇంకా ఏదేదో ఉందనుకున్నాను. ఈ మూడు ముక్కలేనా ఈయన చెప్పింది! ఈ మంత్రం నేను రోజూ వింటూనే ఉన్నానుగా! ఇది ప్రతి పుస్తకంలోనూ ఉన్నదేగా!' అని అనుకుంటాడు ఆ అజ్ఞాని.

గురుముఖతః వచ్చిన ఆ మూడు ముక్కలలో ఎంత మహాత్మ్యం ఉందో, ఎంత మహత్తర శక్తి దాగిఉందో ఆ మూఢునికేమి తెలుసు? గురూపదేశం ఇంతేనా! అనుకుని దానిని మరచి, బుట్టదాఖలు చేసి, మళ్ళీ ఎప్పటిలాగా విషయ సుఖాలలోనూ, విషయ వాసనలలోనూ మునిగిపోతాడు.

ఆకలిగొన్నవాడికి అన్నం పెడితే, దాని విలువ వాడికి తెలుస్తుంది. ఆకలిలేనివాడికి అన్నం పెడితే ఏమి లాభం? వాడు దానిని తినకపోగా, బయట పారవేస్తాడు. అదే విధంగా, ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలనే ఆకలితో ఉన్న వాడికి, ఈ గురూపదేశమనే అన్నం కావాలి. అటువంటి వాడు దానిని ఎంతో ఆర్తితో తిని, తన ఆకలి తీర్చుకుంటాడు. అలా కాకుండా 'ఇదంతా నాకెందుకు? నేనిలాగే పశువులా జీవిస్తాను. ఆకలి వేస్తే తింటాను, కోరిక వస్తే తీర్చుకుంటాను, నిద్రవస్తే నిద్రపోతాను' అని అనుకునేవాడికి ఇది నిరర్ధకం. అటువంటి మూఢుడికి ఉపదేశం చేస్తే అది వ్యర్థమయిపోతుంది.

చిన్న పిల్లవాడికి ఇది చాలా మంచి పుస్తకం చదవరా! అని ఇచ్చామనుకోండి, వాడికి దాని విలువేమి తెలుస్తుంది? వాడు అజ్ఞానంతో దానిని చింపి అవతల పారవేస్తాడు. ఆ పుస్తకాన్ని ఒక జంతువుకి ఇస్తే అది ఏం చేస్తుంది? దానిని చదవగలదా? దాన్ని చింపి తింటుంది. వీడూ అంతే! జంతువుతో సమానం! ఒక చిన్నపిల్లవాడికి అమృతం ఇస్తే, దానిని తీసుకువెళ్ళి వాడు అవతల పారబోస్తాడు.

కనుక గురులక్ష్యార్థం యొక్క అర్థం, విలువ తెలియని మూర్ఖుడికి ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలనే జిజ్ఞాసలేనివాడికి, గురువులు ఉపదేశం చేయకూడదు. తాను ఉపదేశం చేసేముందు ఆ శిష్యుడు తగినపాత్ర ఔనా, కాదా అని ఆలోచించి ఉపదేశం చేయాలి.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

26.12.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మీరంతా రోజూ వస్తున్నారు. మీకు కాలేజీలు ఉన్నాయి. ఆఫీసులు ఉన్నాయి. భగవానుడు మీ స్వధర్మాన్ని ఆచరించమంటున్నాడు. కాని కర్మలో అకర్మని చూడమంటున్నాడు. కాలేజీలో ఉన్నా ఆఫీసులో ఉన్నా 'అయ్యో! బాబుగారు వచ్చే ఉంటారు. ఉపన్యాసం చెపుతుంటారు ఏం చెపుతున్నారో?' అని మనస్సు ఇక్కడ నిలపటం మంచిదా? లేకపోతే ఇక్కడ ఉండి 'అయ్యో! అక్కడ కాలేజీలో ఏం జరుగుతున్నదో? ఆఫీసులో ఏం జరుగుతున్నదో?' అని మనస్సు నిలిపి ఆలోచించటం మంచిదా? మీరే నిర్ణయించుకోండి అది మీకే వదిలేశాను.



శాస్త్రజ్ఞానానికి, శబ్దజ్ఞానానికి భగవత్తత్త్వం అందదు. అనుభవ జ్ఞానము ఒక్కటే. మీరు అనుభవించటమే కాక ఇతరులకు కూడ ఆ అనుభవాన్ని అందజేయటానికి సహాయపడుతుంది. శబ్ద జ్ఞానం ఎలా ఉంటుందంటే ఆరుగురు గుడ్డివాళ్ళు ఒక ఏనుగును చూసి తొండము ఒకడు, తోక ఒకడు కాళ్ళు మరియొకడు పట్టుకొని చూసి వర్ణించినట్టు ఉంటుంది. న్యూయార్క్‌ను మ్యాప్‌లో చూసిన వాడు నాకు అంతా తెలుసు అంటాడు. తీరా విమానాశ్రయంలో దిగాక తెల్ల ముఖం వేస్తాడు.

గురువుగారు, వెంకటరత్నంగారు, హెడ్‌మాష్టారు అంతా ప్రకృతి వేరు పరమాత్మవేరు అని చెప్పారు! బాగానే ఉంది. ఏవండీ గురువుగారూ! మీ ఉపన్యాసము మధ్యలో 'అమ్మా!' అని సంబోధించారు కదా! మీ అమ్మగారు ఈ సభలో లేరు కదా! మీ ఇంట్లో ఉన్నారు కదా!" అన్నారు. గురువుగారు సమాధానం చెపుతూ 'అమ్మ! అని నేను పరమాత్ముడిని, అంటే మిమ్మల్నే సంబోధించాను. మాకు అమ్మ నాన్న అన్నీ మీరే' అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ "అదేమిటండీ హెడ్ మాష్టారుగారూ!

గురువుగారు అలా మాట్లాడుతున్నారు? మీరూ, నేనూ మీసాలు లేకపోయినా పురుషులమేకదండీ! లింగభేదం లేదాండీ? అలాంటప్పుడు ప్రకృతి వేరు పురుషుడు వేరు అని ఉపన్యాసం ఎలా చెప్తారండీ? మా చిన్నతనంలో జరిగిన సంఘటన చెప్తాను.

మా స్నేహితుడు ఒకడు ఉండేవాడు. అతను ఎప్పుడూ మద్రాసు గురించి చెప్పేవాడు. స్టేషన్‌లో దిగి అలా వెళ్తే బీచ్ వస్తుందనేవాడు. ఇంకా పైకివెళ్తే హైకోర్టు వస్తుందని చెప్పేవాడు. వాళ్ళ నాన్నగారు మద్రాసులో ఉన్నారు. పరమాత్ముడి దయ వలన మద్రాసు వెళ్ళే అవకాశం వచ్చింది. వాళ్ళ నాన్నగారు నన్ను చూడాలిట, కాబట్టి తప్పకుండా రావలసిందేనని నన్ను బలవంతం చేశాడు. వెళ్ళక తప్పలేదు. ఇద్దరము కలసి బయలుదేరాం. రైలులో ప్రయాణం చేశాము. ముందుగా ఏదో పెద్ద స్టేషన్ వస్తే అదే మద్రాసు అనుకొని ఇద్దరము అక్కడ దిగబోయాము. ఇంతలో టి.సి. వచ్చి మీరు ఎక్కడ దిగాలి? అని అడిగి తెలుసుకొని మీరు దిగవలసినది ఇక్కడ కాదు, రెండు స్టేషన్ల అవతల దిగాలి అన్నాడు. తీరా సెంట్రల్ స్టేషన్‌లో దిగేసరికి అక్కడి జనం హడావిడి చూసేసరికి నా ప్రక్కన ఉన్న వాడికి గుండె దడదడలాడింది. ఇంతలో నాకు తెలిసిన వ్యక్తి ఒకరు వచ్చి టాక్సీ మాట్లాడి మైసూర్‌కేఫ్ హొటల్‌లో రూమ్‌కి తీసుకువెళ్ళాడు. తర్వాత హైకోర్టు, బీచ్ చూపించాడు. మరి నన్ను మద్రాసు తీసుకువచ్చిన వ్యక్తి అంతా తెలుసునని బుట్టెడు వంకాయలు కోశాడు కదా! అదే అనుభవజ్ఞానానికి శబ్ద జ్ఞానానికి ఉన్న డిఫరెన్స్.

అందువలననే సత్యగురుదేవుడిని ఆశ్రయించాలి. ఆయన ఇచ్చిన లక్ష్యార్థము మీద మనస్సు నిలిపి ఆయన ఆజ్ఞను పాలించాలి. చూడండి మోటారు సైకిలు మీద కూర్చుని దిక్కులు చూడకూడదు. ఎంతో జాగ్రత్తగా నడపాలి. అలాగే నదిలో నావను నడిపేవాడు దిక్సూచి వైపు చూడక దిక్కులు చూస్తూ పోతే ప్రయాణం చాలా కష్టము అవుతుంది కదా! మరి గురుదేవుడు ఇచ్చిన లక్ష్యార్థము మీద మనస్సు నిలిపి గురుదేవుడి ఆజ్ఞను ఎంత జాగ్రత్తగా అనుసరించాలో ఆలోచించండి” అన్నారు శ్రీబాబు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషమ్నా ప్రసాద

"జనక మహారాజు నిర్వికల్పసమాధి స్థితిలో, చాలా కాలం వుండిపోయాడు, సమాధి స్థితి నుండి బయటకు వచ్చి యిలా అన్నారు "నేనిప్పడు సర్వత్రా అవిభాజ్యమైన బ్రహ్మను మాత్రమే సందర్శిస్తున్నాను. నేను ఆత్మలోనే కేంద్రీకృతమై వున్నాను, ఏదీ నన్ను చలింపచేయలేవు. నేనిప్పడు రాగ, ద్వేషములకతీతుడను ప్రాపంచిక విషయాలకు, సుఖాలకై, నేను ప్రాకులాడను. నాకే కోరికాలేదు, సమదృష్టి, సమహిత బుద్ధి కలిగి యున్నాను."



అప్పడాయన తన రాజకీయ విధులన్నిటినీ, యెవరి ప్రమేయము లేకుండ, నిర్వహించాడు, తన రాజ్యపరమైన విధులన్నిటిని, వాటి ఫలితాలను గురించి, ఆశించక, ఆందోళన చెందక, సక్రమంగా నిర్వర్తించాడు. అలా జీవించివుండగనే, జీవన్ముక్తుడయినాడు, గతాన్ని గురించి ఆలోచించలేదు, భవిష్యత్తును గురించి చింతించక, నిశ్చలంగా వున్నాడు.

వశిష్ఠ మహర్షి రామచంద్రునితో యిలా చెప్పాడు "ఓ రామా! ఆత్మ జ్ఞానము నిరంతర ఆత్మ విచారణతో లభ్యమయ్యేదే కాని, కర్మ వల్ల మాత్రము కాదు, ప్రాపంచిక విషయాలపై మనసు లగ్నమైన వారు, భౌతిక సుఖాల కోసమే ప్రాకులాడుతారు. పూర్వజన్మలలో చేసిన కృషి వల్ల ఆత్మ సాక్షాత్కారమునకై, తీవ్రమైన తపన వుంటుంది, బాధలకు పునర్జన్మలకు కారణభూతమైన అజ్ఞానమును పూర్తిగా నశింపచేయాలి.

ఎవరైతే పరమాత్మ స్థితిని పొందాలని ఆశిస్తారో, వారు అహంకారమును, కోరికలను, తాపత్రయమును నిర్మూలం చేసుకోవాలి.

అహంకారమనే మేఘము విచ్ఛిన్నము కాగానే, దివ్య కాంతి సూర్య కాంతిలా మిరుమిట్లుగొల్పుతూ, ప్రకాశిస్తుంది. ఆత్మ సాక్షాత్కారమును పొందిన వారు బాహ్య ప్రపంచపు ఆలోచనల నుండి విముక్తుడవుతాడు, అతను ప్రాపాంచిక సుఖ, దుఃఖములకతీతుడుగా

వుంటాడు, రాగ, ద్వేషముల నుండి విముక్తుడవుతాడు.

ఆత్మ జ్ఞానము వలన బ్రహ్మమనే భాస్కర జ్యోతి కడ్డముగా వున్న అహంకారమనే గాఢ మేఘమంతరిస్తుంది. జ్ఞానుల హృదయ పేటికలలో బంధింపబడ్డ జ్ఞానమనే అమూల్య రత్నము, యేది తలిస్తే దానిని ప్రసాదించే కల్పవృక్షంలా, తృటిలో లభిస్తుంది.

చిత్కల్పనే యీ ప్రపంచములా ప్రకాశిస్తుంది ఈ జగత్తు బ్రహ్మకు భిన్నముకాదు, దానికి ప్రత్యేకమైన వునికిలేదు. ఈ జగత్తుకు, జగత్తుగా వునికేలేదు, ఈ జగత్తు బ్రహ్మము తప్ప, తద్భిన్నమైనది కాదు, మనసనే అద్దము ద్వారా బ్రహ్మము విశ్వముగా గోచరిస్తున్నది.

నిష్కామము, ఏకత్వమైన జ్ఞానముతో మిళితమైనప్పుడు, మనసనే పదార్థాన్ని కరిగించి మహోన్నతమైన పరమానందమును ప్రసాదిస్తుంది. జీవితానికి మహోన్నత లక్ష్యమైన పరమాత్మ స్థితిని పొందుతాడు.

కనుక పద్మలోచనుడవైన ఓరామా, జనకుని వలె ఆత్మపై ఏకాగ్రదృష్టితో ధ్యానము చేసి, ఆత్మ జ్ఞానము పొందవలసినదని ప్రబోధిస్తూ వశిష్ఠ మహర్షి ముగించాడు.

- సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

జులై 2015

11 శనివారం శ్రీగురుదశమి రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ,

31 శుక్రవారం శ్రీగురుపూర్ణిమ రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

ఆగస్ట్ 2015

9 ఆదివారం శ్రీగురుదశమి. రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

వివరాలకు : శ్రీ నరసింహారావు సెల్ - 94912 22652

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జులై 2015

2 గురు : (అధిక ఆషాఢ) పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ

11 శని : శ్రీ గురుదశమి - సత్సంగ సమావేశము, శ్రీసద్గురు పాదపూజ

14 మంగళ : మాసశివరాత్రి, గోదావరి పుష్కర ప్రారంభం.

16 గురు : అమావాస్య

17 శుక్ర : దక్షిణాయనం

27 సోమ : తొలిఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన

31 శుక్ర: నిజ ఆషాఢ పౌర్ణమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, చాతుర్మాస్య దీక్ష ప్రారంభం.

ఆగస్టు 2015

9 ఆది : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

12 బుధ : మాసశివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

14 శుక్ర : అమావాస్య

15 శని : భారత స్వాతంత్ర్య దినము

28 శుక్ర : శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం.

29 శని : రాఖీ పూర్ణిమ, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

సద్గురుమూర్తి ఉపాసన అవసరమా? సాధన చేసేది సంకల్ప రహితం కొరకే కదా! సంకల్పం రహితం అయ్యేవరకు పూజ, ఉపాసన చేయవలసినదే. సంకల్పరహితము అయిన మరుక్షణము ఉపాసన అవసరం లేదు. మనస్సు బాహ్య ప్రపంచంలో సంచరిస్తూ ఆనందం కొరకు వెదుకులాడుతుంది. బాహ్య ప్రపంచంలో లభించే ఏ ఆనందమయినా అశాశ్వతమైనదే కదా! అందువలన మనస్సుకు శాంతి లేదు.



ఉపాసన చేసేటప్పుడు సద్గురుమూర్తిని సర్వ దేవతా స్వరూపుడుగా భావన చేయాలి. తత్త్వబోధ చేసేటప్పుడు సాక్షాత్తు పరబ్రహ్మగా భావనచేస్తూ శ్రవణం చేయాలి. సద్గురుమూర్తి అందరివాడు. అందనివాడు కాదు కదా! అందరూ ఆయన బిడ్డలే. ఆయన సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు, సర్వశక్తి సంపన్నులు. కాబట్టి అందరూ ఆయన బిడ్డలే. వీరు నా శిష్యులు, వారు నా శిష్యులు కాదు అనే భావన ఉండదు. లక్ష్యార్థం అనేది అక్షరాభ్యాసం లాంటిది. అది ప్రసాదించిన వారే ఆధ్యాత్మిక విద్యార్హత కలిగినవారు అనే భావన యదార్థం కాదు. లక్ష్యార్థం ప్రసాదించనివారికి కూడా ఆధ్యాత్మిక విద్యని అభ్యసించే అర్హత ఉంది.

సద్గురుదేవులు సమర్థులు. అందరినీ ఆ మార్గంలో నడిపించే శక్తి ఆయనకుంది. ఆయన అందించే అమృతాన్ని అందుకునే అర్హత అందరికీ ఉంది. గురుతత్త్వాన్ని అందరికీ అందుబాటులో ఉంచేలా చేయటమే వారి ధ్యేయం. 'హనుమ ఎప్పుడూ శ్రీరామ చంద్రుని పాదాల చెంతనే కూర్చుని ఉంటాడు కదా! ఆయనను జ్ఞాని అంటారు అది ఎలా సమంజసంగా ఉంటుంది?' అన్న ఒక భక్తుని సందేహాన్ని పురస్కరించుకుని సద్గురుదేవులు గురుతత్త్వాన్ని గురించి చెప్పిన విషయమిది. ఇంకా వివరిస్తూ "దేహాభిమానాన్ని త్యజించని వ్యక్తి హనుమని శ్రీరామప్రభువుకి దాసునిగా భావన చేయవచ్చు. సాధనలో కొంచెం పరిణతి చెంది జీవభావంతో వీక్షించేవారికి హనుమ భక్తుడిగా గోచరిస్తాడు. అంతేకాదు జ్ఞానదృష్టితో చూసినవారికి హనుమ శ్రీరామచంద్రునికి భిన్నంగా గోచరిస్తాడా? త్వమేవాఽహం అంటే అదేకదా!

# ముక్కోటి దేవతలు ఒక్కటైనారు

- పెనుమాక నాగేశ్వరరావు

ముక్కోటి దేవతలు ఒక్కటైనారు
ఒక్కటైన రూపమే గురుదేవుడన్నారు ॥ముక్కోటి॥

గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర
గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః ॥ముక్కోటి॥

అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవేనమః ॥ముక్కోటి॥

గురుపదాంభోజముల్ గొలువక కల్గునే ప్రవిమల వైరాగ్యభాగ్యమహిమ
గురుపాద తీర్థంబు గ్రోలక గల్గునే జ్ఞానవిజ్ఞాన యోగానుభవము
గురుసుప్రసాదంబు గొనకున్న కల్గునే ప్రతిలేని చిత్తోపరతి సుఖంబు
గురుతత్త్వమాత్మ కంగొనకున్న కల్గునే నిరతిశయంబైన పరమపదము
॥ముక్కోటి॥

ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే
వ్యోమవద్వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః ॥ముక్కోటి॥

మంగళమ్ గురుదేవాయ మహనీయ గుణాత్మనే
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళమ్ ॥ముక్కోటి॥



(గత సంచిక తరువాయి)

# గీతాధ్యయనమ్

- రమణ ప్రసాద్

భగవానుడు జ్ఞాన కర్మ యోగ విశిష్ఠతను తెలిపి ఆ రెండిటి సహాయభూతమైన ధ్యాన యోగాన్ని ప్రస్తావిస్తున్నాడు. ముందుగా నిష్కామ కర్మయోగం గురించి చెబుతూ .....

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః ॥1**



కర్మఫలాపేక్షలేక కర్మ చేసేవాడే సన్న్యాసి అతడే యోగి. అంతేగాని అగ్నిహోత్రాలను వదలటం గాని, కర్మలను విడిచిన వాడుగాని సన్న్యాసి గాని, యోగిగాని కాలేడు. అర్జునా! సన్న్యాసము, కర్మయోగము ఒకటే అని తెలుసుకో. సంకల్పాలను విడిచి పెట్టనివాడు ఎవ్వడూ యోగి కాలేడు.

**యదా హి నేంద్రియార్థేషు న కర్మ స్వనుషజ్జతే ।**
**సర్వసంకల్ప సంన్యాసీ యోగారూఢస్తదో చ్యతే ॥ 4**

ఇంద్రియ విషయాల మీద, కర్మల మీద ఆసక్తి వీడి, సంకల్పాలను త్యజించిన వాడే యోగారూఢుడు అని పిలువబడతాడు.

**ఉద్ధరేదాత్మ నాऽऽత్మానం నాత్మన మవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపు రాత్మనః ॥ 5**

తన మనస్సే తనకు బంధువు, శత్రువు కూడా. కనుక మానవుడు తనను తానే ఉద్ధరించుకోవాలి. ఆత్మను జయించిన ప్రశాంతాత్ముడు, పరమాత్మ సాక్షాత్కారం పొందుతూ శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలపట్ల సమభావం కలిగి ఉంటాడు.

ఏకాంత స్థితిలో ఒంటరిగా, ఆశలను విడిచి, ఇంద్రియాలను వశపరచుకుని, చిత్తాన్ని ఆత్మ యందే నిలపాలి. శ్రీగురుదేవులు "ధ్యానం చేసేటప్పుడు ధీరులుగా ఉండాలి. నిటారుగా కూర్చుని మనసును మరచి ధ్యానం చేయాలి" అని చెప్పేవారు. అమితంగా భుజించేవారికి, బొత్తిగా తినని వారికి అత్యధికంగా నిద్రపోయేవారికి, అసలు నిద్రపోనివారికి యోగం సిద్ధించదు.

ఆహారవిహారాలలో, కర్మలలో నిద్రలో మేల్కొనటంలో పరిమితి పాటించేవారికి యోగసిద్ధి కలిగి సర్వదుఃఖాలు హరిస్తాయి. మనస్సును

వశపరచుకుని ఆత్మమీద నిలిపి సర్వవాంఛలు విసర్జించినవాడు యోగ సిద్ధి పొందుతాడు. అతని మనస్సు గాలిలో దీపంలాగా నిలకడగా ఆత్మ మీద నిలబడి ఉంటుంది. ఏమాత్రము ఇతర చింతనలు చేయ కూడదు. యోగసిద్ధిని పొందినవాడు సమస్త భూతాల యెడల సమ భావం కలిగి సర్వభూతాలలో తన ఆత్మను, తన ఆత్మలో సర్వభూతాలను సందర్శిస్తాడు" అని భగవానుడు చెప్పగా అర్జునునికి చంచలమైన ఈ మనస్సును నిగ్రహహించటం ఎలా అనే సందేహం కలిగి,

**చంచలం హి మనః కృష్ణ! ప్రమాధి బలవద్ధృఢమ్ ।**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥ 34**

"కృష్ణా! మనస్సు చాలా చంచలం బలవత్తరం సంక్షోభం కలిగించేది. దానిని నిగ్రహించడం గాలిని నిరోధించటం లాగా దుష్కరం అని భావిస్తున్నాను" అన్నాడు. దానికి సమాధానంగా భగవానుడు...

**అసంశయం మహాబాహో! మనోదుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌంతేయ! వైరాగ్యేణ చ గృహ్యతే ॥ 35**

"అర్జునా! మనస్సు నిగ్రహించటానికి శక్యం కానిది అని అన్నావు. అందులో సందేహం లేదు. అయితే దానిని అభ్యాసం చేత, వైరాగ్యం చేత వశపరచుకోవచ్చు". మనోనిగ్రహం లేనివానికి యోగం సిద్ధించదు. అని భగవానుడు చెప్పగా "కృష్ణా! మోక్ష సాధనలో నిలకడలేనివాడు ఇహపర సౌఖ్యాలు రెంటికి భ్రష్టుడైపోడు కదా!" అని అడిగాడు అర్జునుడు. "యోగభ్రష్టుడుకి ఈ లోకంలోగాని, పరలోకంలోగాని హాని కలుగదు. పుణ్యకర్మలు చేసేవాడు ఉత్తమలోకాలలో భోగాలు అనుభవించి, మర్త్యలోకంలో సంపన్నుల ఇంట్లోగాని, యోగుల వంశంలో కాని పుడతాడు. పూర్వజన్మలోని అభ్యాసం వల్ల అతడు యోగ సాధన కొనసాగిస్తాడు.

**యోగినామపి సర్వేషాం మద్గతేనాంత రాత్మనా ।**
**శ్రద్ధావాన్ భజతే యోమాం స మే యుక్తతమో మతః ॥ 47**

యోగులందరిలో ఎవరైతే మనస్సు నా మిద నిలిపి, శ్రద్ధా భక్తులతో నన్ను సేవిస్తాడో, అతడే ఉత్తముడు అని నా మతం" అని భగవానుడు సెలవిచ్చాడు.

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

తనని పెంచినవాళ్ళు, తల్లిదండ్రులు వాళ్ళ ఆలోచనలు అప్పుడప్పుడు మనస్సులో మెదలుతూ ఉంటే, వెనుకటి రోజులు గుర్తుకు వస్తుంటే పూర్ణ రోజూలాగే, మధురానగరానికి వెళ్ళి తిరిగి వస్తుంటే దారిలో ఒక చిన్న పిల్లవాడు ఒక మామిడి చెట్టు క్రింద నిలబడి రాళ్ళు విసురుతూ కనిపించాడు. వాడి దగ్గరకి వెళ్ళింది పూర్ణ. 'అక్కా! చెట్టుమీద చిటారు కొమ్మన ఒక మామిడిపండు ఉంది, అది కోసి ఇవ్వవా తినాలని ఉంది' అని బ్రతిమాలడసాగాడు. చిన్నప్పుడు తాను చెట్టుఎక్కి అందరికీ కాయలు కోసి పెట్టడం గుర్తువచ్చింది. జాలిపడి, కోయడానికి సిద్ధపడింది. పండుకోసి, దిగేసమయంలో కాలుజారి పడబోయింది.



అదే సమయంలో ఒక చెయ్యి ఆమె నడుముకు చుట్టుకుని, గుండెలకి హత్తుకోవటం లీలగా తెలిసింది. ఆపైన ఏం జరిగిందో! తెలివి వచ్చేసరికి తను పచ్చికమీద పడుకుని ఉంది. పండు అడిగినవాడి కోసం తన రెండు కళ్ళు వెతికాయి. కాని వాడు కనబడలేదు. కాని ఎదురుగా నిలబడి ప్రేమగా తననే చూస్తున్న రెండు నల్లని విశాలమైన నేత్రాలు కనిపించాయి. 'దెబ్బలు తగలలేదు కదా?' అనే పలకరింపు వినిపించింది. లేచి కళ్ళు తెరచి బాగా చూసింది.

'సమయానికి నేను ఉన్నాను కాబట్టి సరిపోయింది.' ప్రేమ, ఆప్యాయత నిండిన ఆ మూర్తి ఎవరో తనకు తెలియలేదు. తను కోసిన పండు ఏమైందో అని చూసేలోపున 'నువ్వు కోసిన పండు తీసుకుని ఆ పిల్లవాడు పరుగెత్తాడు. వెనక్కి అయినా తిరిగి చూడలేదు' అన్నాడు. 'మీ ఇంటి దాకా నీకు తోడు వస్తాను పద' అని చెయ్యి పట్టుకున్నాడు. వాకిలి దాకా వచ్చాక 'నేను వెళ్ళివస్తాను' అని తిరిగిపోతున్న అతనిని అప్పుడు ప్రశ్నించింది పూర్ణ 'ఎవరు నీవు?' అని.

'నేను వ్రేపల్లెకు చెందిన నందరాజు-యశోదమ్మల ముద్దు బిడ్డడను' అని మరుక్షణంలో మాయమయ్యాడు. పూర్ణ జీవితంలో మరుపురాని మార్పు వచ్చింది ఆ రోజు నుండి. ఆ రాత్రంతా ఆలోచిస్తూ

పడుకుంది. నడుం చుట్టూ చెయ్యి వేసి, గుండెలకు హత్తుకున్న ఆ స్పర్శ ఎంత మధురాతిమధురంగా ఉంది! తనవైపే చూస్తున్న ఆ నల్లని నేత్రాల మెరుపులు లీలగా ఎక్కడో చూసిన గుర్తు వచ్చింది.

చాలా రోజుల వెనుక పెద్దమ్మవాళ్ళు తనని యశోదమ్మకు కొడుకు పుట్టాడని చూసివద్దామని తీసుకువెడితే, జనం వత్తిడిగా ఉందని దూరంగా నిల్చుని ఆ పిల్లవాడిని తాను చూసింది. ఉయ్యాలలో ఉన్న ఆ పిల్లవాడి కనులలో మెరపులు తనను మురిపించిన సంగతి జ్ఞాపకం వచ్చింది. అవును! ఆ పిల్లవాడే ఇప్పుడు నన్ను ఆపదలో ఆదుకున్న వాడు అని గుర్తించింది. కాని ఎంత చిత్రం! చిన్న చేతులతో తనను క్రింద పడిపోకుండా ఎలా పట్టుకున్నాడు! చూపులకు చిన్నవాడు కాని చేతలకు ఆరిందా!

ఆలోచనలతోనే తెల్లవారింది. పూర్ణకు లేవాలనిపించ లేదు. రోజూలాగ ఇంటిపనులు చేయాలనిపించలేదు. ఇన్నాళ నుండి ఏమై పోయాడు? తనకు కనబడకుండా తనుండే రేపల్లెలోనే ఉంటూ. అవును మరి ఇప్పడిదాకా తన ఆలోచనలు, ఆటపాటలతో, పనిపాటలతో సరిపోయింది. యశోదమ్మ బిడ్డడి గురించి తను ఎవరితోనూ మాట్లాడ లేదే! అతని గురించి మాట్లాడకుండా ఎన్ని రోజులు వ్యర్థంగా గడిచిపోయాయి. ఎంత పొరపాటు జరిగింది! ఎంతకాలం వృథా అయింది!........ అంటూ ఇలా విచారంలో పడింది.

పెద్దమ్మ ఇంటికి వెళ్ళి యశోదమ్మ ఇల్లు ఎక్కడ అని అడిగితే ఇరుగుపొరుగు అందరూ కూడా ముఖం మాడ్చుకుని 'ఆ ఇల్లు నీకెందుకే? వాళ్ళ పిల్లవాడు తుంటరివాడు. జాగ్రత్త! నీకా జోలి వద్దులే' అన్నారు. పూర్ణ మనస్సు చివుక్కు మన్నది. ఇంటికి వచ్చి మళ్ళీ ఆలోచించ సాగింది పూర్ణ. తనని పడిపోకుండా పట్టుకున్న ఆ చెయ్యి ఎంత బలమైనదో! చూస్తే తామర తూడులా ఉంది. గుండెకి హత్తుకున్న ఆ వక్షస్థలం ఎంత విశాలమైనదో! చూస్తే లేత తమలపాకులా మెరిసిపోతున్న ముత్యాలసరాలతో అలరారుతోంది. మరి అది ఎలా సాధ్యం? ఆ చిన్నారి బాలుడా! అల్లరివాడు? ఆడపిల్లలను ఏడిపించేవాడు? ఈ పెద్దల మాటలలో సత్యం లేదనుకుంది. అందుకే ఇంతకాలం ఆ బాలగోపాలుడి గురించి తెలియలేదు తనకు అనుకుంది.

- సశేషం

# ఓ వృక్ష రాజమా!

- కామేశ్వరీ ప్రసాద

నారద మహర్షి త్రిలోక సంచారి, త్రిలోకపూజ్యుడు. ఏదో ఒక కారణం లేకుండా ఆయన కథ ఉండదు. ఒకనాడు మార్గమధ్యంలో ఆయనకు ఒక చక్కని వృక్షం కనిపించింది. ఆ వృక్షం చక్కని ఫల పుష్పాదులతో నిండి, చూడటానికి చాల అందంగా ఉంది. నారద మహర్షి దృష్టి ఆ వృక్షం మీద పడింది. వెంటనే ఆయన ఆ వృక్షాన్ని పలుకరిస్తూ.. "ఓ వృక్ష రాజమా! చాలా అందంగా, శోభాయమానంగా ఉన్నావు. రేపు ఉదయం పెద్దగాలి వచ్చి నిన్ను కూకటివ్రేళ్లతో పెకలించి పడేస్తుందేమో! ఇంత చక్కగా ఉన్నానని గర్వపడకు" అన్నాడు.

"నాకేమీ భయం లేదు స్వామీ!" అన్నది ఆ వృక్షం. "రేపు తెల్లవారాక వచ్చి నీ స్థితి చూస్తాను" అని వెళ్ళిపోయాడు నారద మహర్షి.

తరువాత ఆ వృక్షం ఆలోచించింది. 'తెల్లవారితే గదా గాలి వచ్చేది. కనుక నేను ఇప్పుడే జాగ్రత పడాలి' అని నిశ్చయించుకొని, తనంతట తానే తన కొమ్మలు, రెబ్బలు, ఆకులు, పుష్పములు, ఫలములు అన్నీ రాల్చుకుని మోడులా నిలబడింది.

మరునాడు ఉదయమే నారదమహర్షి వచ్చి చూసేసరికి మోడు మిగిలింది. వాయుదేవుడు ఆ వృక్షాన్ని ఏమీ చేయలేక పోయినాడు. అప్పుడు నారదుడు "శభాష్! వృక్షరాజమా! నీవు ఈ ప్రపంచానికే ఆదర్శము. మానవుడు ఈ మాయా ప్రపంచములో పడి తను ఎందుకు పుట్టాడో, ఏమి చేయాలో, ఏమి చేస్తే మరి జన్మ ఉండదో మహాత్ముల ద్వారా మనకు తెలుస్తుంది. వృక్షము జాగ్రత్త పడినట్లు మానవుడు తన ఇంద్రియాలను తానే నిగ్రహించుకోవాలి. మహాత్ములు బోధించినది శ్రవణం చేసి మనన నిదిధ్యాసల ద్వారా పరమాత్మను పొందే ప్రయత్నం చేయాలి. తరించాలి" అన్నాడు.

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

రాజవిద్యా రాజగుహ్యయోగంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి బోధ చేస్తూ ముక్తి ప్రత్యక్షమైనది, సులభమైనది కాని శ్రద్ధ ఉన్నవారికి మాత్రమే అది సాధ్యం అన్నారు. అది అర్జునినికి మాత్రమే వర్తిస్తుంది, మనకి కాదు. మనమంతా ఆశ్రమ వాసం చేస్తున్నాము, సద్గురుమూర్తిని ఆశ్రయించాము, ఇంక మనకి లోటేమున్నది అంతేకాదు అన్నిటినీ వదిలివేశాము. మోక్షం సులభం అనుకున్నవారికి సులభం. 'ఇది మనకి సాధ్యపడుతుందా?', 'మన వలన అవుతుందా?' అని సందేహించేవారికి మాత్రం కష్టమే కావచ్చు. మానవుడిగా పుట్టి ఆధ్యాత్మిక విద్యని అభ్యసించేవాడివి, అన్నీ తెలిసిన వాడివి నీకు కష్టం ఎలా అవుతుంది? మనం అమృత పుత్రులం, మృత పుత్రులం కాదు.

మనస్సు బహిర్ముఖమైనవారికి వారి మనస్సులో సంసారం ప్రవేశిస్తుంది. అంటే పునరపి జననం, పునరపి మరణం. అదే సంసారం అంటే. అదే మనస్సు అంతర్ముఖమైతే మోక్షమే.

శుద్ధ మనస్సు అంటే వృత్తి రహితమైనది. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు స్పందించనిది. బంధములో ఉందనుకోవటం భ్రమ. బంధము తొలగాలి అనుకోవటం అంతకన్న పెద్ద భ్రమ. అసలు బంధం ఎక్కడిది?

సుషుప్తిలో సంసారం లేదు కదా! మరి సుషుప్తిలో లేని సంసారం ఎక్కడి నుండి వచ్చింది? సంసారం అంటేనే జగత్తు. శంకర భగవత్పాదులవారు జగత్తును గురించి ఎందుకు ప్రస్తావించారంటే ముందుగా బ్రహ్మం యొక్క విశిష్టతను సాధకుడు గుర్తించటం కోసం జగత్తు మిథ్య అని ప్రస్తావించారు.

బ్రహ్మను గురించి అవగాహన కల్గి, సాధనలో పైకి ఎగబ్రాకిన కొద్దీ, జగత్తుకు ఉనికి లేదన్న విషయం తేటతెల్లమవుతుంది. జగత్తు ఉందనుకుంటే అస్తి. అది ప్రకాశమానమై గోచరిస్తుంది కాబట్టి భాసి అంటే జగత్తు బ్రహ్మమే కదా! జగత్తు ఎలా ఉంది? నీకు భిన్నంగా లేదు. నీకంటే అన్యంగా లేదు. పోనీ జగత్తులో భార్య, పిల్లలు, ఇల్లు, వాకిళ్ళు,

సంసారం అన్నీ ఉన్నాయి కదా అనుకుంటే ఉన్నాయి కాబట్టి అస్తి. అంటే ఉనికి కాబట్టి సత్తు. అవి గోచరిస్తున్నాయి కాబట్టి భాసి అంటే చిత్తు. ఉన్నది సత్తు, భాసించేది చిత్తు. జగత్తు ఎక్కడ ఉంది? ఉన్నదంతా బ్రహ్మమే. జగత్తు ఉన్నదనుకోవటమే అజ్ఞానం. నీ స్వరూపాన్ని మరువటమే అజ్ఞానం. ముక్తి అనేది భావా భావాలకు, ధర్మాధర్మాలకు అతీతమైనది. అది బుద్ధికి అందేది కాదు. బుద్ధికి ఆవల ఉన్నది. మంద బుద్ధి అజ్ఞానం.

- సశేషం

## భగవదున్మాదము

శ్రీరాముడు, లక్ష్మణుడు ఒకసారి పంపానదిని సందర్శిస్తున్నారు. అప్పుడు లక్ష్మణుని దృష్టి ఒక కాకిమీద పడింది. ఆ కాకి నీళ్ళ కోసం తహతహ లాడుతోంది. మాటిమాటికి ఆ కాకి నీళ్ళ అంచుదాక వెళ్ళి కూడా త్రాగ కుండా తిరిగి రావటం లక్ష్మణుడు గ్రహించాడు. దాని రహస్యమేమిటో ఆయనకు అర్థం కాలేదు. 'అన్నయ్యా! అదేమిటి! ఆ కాకి ఆలా చేస్తోంది?' అని అడిగాడు.

శ్రీరాముడు 'లక్ష్మణా! ఆ కాకి ఒక గొప్ప భక్తుడు. అది రామ నామాన్ని రాత్రింబవళ్ళు జపిస్తూ ఉంటుంది. అందువల్ల దాని గొంతు ఎండిపోయింది. కానీ, నీళ్ళు త్రాగితే, ఆ నీళ్ళు త్రాగేలోపల నామస్మరణ ఆగిపోతుందేమోనని దాని భయం' అన్నాడు.

శ్రీరామకృష్ణులు ఈ కథను విజయకృష్ణ గోస్వామికి చెప్పారు. ఆయనలో ఉన్న భక్తివైరాగ్యాలను ఇంకా పెంపొందించాలని ఇంకా ఇలా చెప్పారు...

"చూడు! చాతకపక్షి స్వాతివాన నీటినే ఆశిస్తుంది. దాహంతో తన ప్రాణం పోతున్నాసరే, తన ముఖాన్ని పైకెత్తి ఆ స్వాతివన చినుకుల కోసమే ఎదురు చూస్తుంది. గంగ, యమున మొదలన మహానదులు, సరస్సులు నిర్మలమైన నీటితో నిండి ఉన్నా, ఈ భూమిపై ప్రవహించే ఒక్క నీటి చుక్కను కూడా అది ముట్టదు. అలాగే భగవదున్మదుడైన వాడికి మరే ఇతర విషయాలు రుచించవు, నచ్చవు, తెలియవు."

(శ్రీరామకృష్ణుల గూఢార్థ కథల నుండి)

# సద్గురు శ్రీ యాత్రాదర్శన్

(గత సంచిక తరువాయి) -డా॥ సుధ

19-5-2014 - ఉదయం 6గం.లకు బయలుదేరి గుల్మార్గ్ వెళ్ళాము. విశాలమైన ప్రకృతి సౌందర్యం. భగవంతుని సృష్టిలో అందాలు ఎంతని, ఏమని వర్ణించగలము? ప్రకృతి సహజమైన ఆ పువ్వులు, చెట్లు, మంచుకొండలు, జల ప్రవాహాలు, పచ్చిక బయళ్ళు, మనోహరంగా ఉన్నాయి.

మంచు కొండలపైకి రోప్‌వేలో వెళ్ళి ఒక గంట మంచులో సరదాగా గడిపి వచ్చాము. స్విట్జర్లాండ్ గుర్తుకు వచ్చింది. తిరిగి వచ్చి భోజనం చేసి మధ్యాహ్నం 3గం.లకు బయలుదేరి అమృతసర్ చేరాము.

20-5-2014 - మధ్యాహ్నం చీచీ మాత గుడి సత్రంలో దిగాము. రాత్రి 10గం.లకు అమృత్‌సర్ స్వర్ణదేవాలయానికి వెళ్ళాము. రాత్రి దీపకాంతులలో వెలుగులీనుతున్నది. చక్కని భజన, సేవ, శుభ్రత, మరియు పవిత్రతకు నిలయం స్వర్ణదేవాలయం. భోజనంచేసి రాత్రికి బయల్దేరి ఢిల్లీ చేరాము.

21-5-2014 - ఉదయం కాలకృత్యాలకు, ఫలహారానికి ఒకసారి ఆగి, మధ్యాహ్నం ఢిల్లీ బిర్లామందిర్‌లోని బసకు చేరుకున్నాము. మాతాజీని రెండురోజుల తరువాత దర్శించాము. ఆ రాత్రి 11గం.లకు ఢిల్లీ నుండి తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు బయలుదేరాము.

22-5-2014 - రాత్రి 12గం.లకు విజయవాడ చేరాము. అక్కడి నుండి నంబూరు ఆశ్రమానికి చేరుకున్నాము.

23-5-2014 - ఉదయం యాగం, అభిషేకాలు, గురుపూజ మరియు సత్సంగం చేసుకున్నాము. అమ్మదగ్గర సెలవు తీసుకుని ఎవరి స్థానాలకు వారు బయల్దేరారు.

# సమత

- కృష్ణ మోహన్

'సమత' మన ఆధ్యాత్మిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. శ్రీసద్గురుదేవులు మనకిచ్చిన ప్రార్థనలో 'ఇతరుల యందు మంచినే చూచుటకు, మంచినే చేయుటకు, తగిన సద్బుద్ధిని ప్రసాదింపుము, సర్వజీవులు సమభావముతోను, ప్రేమ దృష్టితోను మెలగుదురుగాక!' అని ప్రబోధించారు. శ్రీమాతాజీ 'సృష్టిని మార్చలేముగాని, మన దృష్టిని మార్చగలము' అని బోధిస్తున్నారు.

మన కుటిల స్వభావాలను విడిచి, పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందించుకుంటే మనకు కలిగేది ప్రశాంతి. తద్వారా ఆనందం. అన్ని జీవరాసుల్లోను, అన్ని వస్తువులలోను నిండి ఉన్నది ఒక్కడే పరమాత్మ అనే సమతాదృష్టి మన ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడుతుంది.

అందరు కోరుకునేది జీవితంలో ఆనందము. ఒక సెమినార్ జరుగుతోంది. అందులో 50మంది పాల్గొంటున్నారు. ప్రధాన వక్త అందరికీ ఒక్కొక్క బెలూన్ ఇచ్చి, వారిపేర్లు వాటిమీద వ్రాయమన్నారు. ఆ బెలూన్లు అన్నీ ఒకే గదిలో ఉంచారు. 5నిమిషాలలో ఎవరి బెలూన్‌వారు తీసుకోవాలి అని ఆ వక్త చెప్పారు. వెంటనే అందరూ ఒకరినొకరు తోసుకుంటూ, క్రిందపడవేసుకుంటూ గందరగోళం చేశారు. ఇచ్చిన సమయంలో పని జరుగలేదు. ఇది చూసిన వక్త 'ఒకొక్కరు వారికి దొరికిన బెలూన్ తీసుకుని, దానిమీద ఉన్న పేరు చూసి, ఆ వ్యక్తికి అందజేయండి' అన్నారు. అప్పుడు సులభంగా ఎవరిపేరున్న బెలూన్ వారికి వచ్చింది.

ఆ ప్రవక్త అన్నారు 'మన జీవితంలో రోజూ జరుగుతున్నది ఇదే. ఆనందం గురించి అంతటా వెతుకుతున్నాము ఎక్కడ ఉన్నదో తెలియటం లేదు. కానీ మన సంతోషం ఇతరుల ఆనందంలో ఉన్నది. తోటి వారికి ఆనందం కలిగిస్తే మనకు ఆనందం లభిస్తుంది. ఇదే మానవజన్మ సార్థకత.

మనం ప్రక్కవారిలో ఆశించే గుణాలు మనలోనే ముందుగా చోటు చేసుకోవాలి. అవి తప్పక సద్గుణాలు అవుతాయి. హృదయం పవిత్రం అవుతుంది. భగవానుడు అట్టి హృదయంలో శాశ్వతంగా నిలిచి ఉంటాడు.

## రాజమండ్రి నగరంలో శ్రీకాళీవనాశ్రమ శాఖ ప్రారంభం

17-24-7/1, శ్రీబాబూ నివాస్, వంగల వారి వీధి; సీతంపేట, రాజమండ్రి 533101

ది. 8-6-2015 శ్రీమన్మథనామ సంవత్సర జేష్ఠమాస బహుళ షష్టి సోమవారం నాడు ఉదయం 7-47ని॥కు శ్రీమాతాజీ శ్రీబాబునివాస్‌లో విఘ్నేశ్వరపూజ చేసిన తరువాత శ్రీకాళీవనాశ్రమ శాఖ శుభారంభం చేశారు. ఆ తరువాత పుణ్యాహవాచనం, శ్రీ సద్గురు పాద పూజ జరిగింది. పూజానంతరం తీర్థ ప్రసాదములు, ఉపాహారాన్ని భక్తులందరూ తీసికున్నారు. 10గం.లకు సంకీర్తన జరిగింది. 12 గం.లకు శ్రీ మాతాజీ వారు అనుగ్రహ భాషణ చేశారు. ఆ తరువాత మహానివేదన చేసిన ప్రసాదాన్ని భక్తులందరూ స్వీకరించటంతో కార్యక్రమం ముగిసింది.

శ్రీ మాతాజీ తమ సత్సంగ ప్రవచనంలో ఈ విధంగా భక్తులందరికీ తమ దివ్యబోధను ప్రసాదించారు:

"దైవం మానుషరూపేణ' అన్నట్లు శ్రీ సద్గురుదేవులు వారి అవతార సమయంలో, అంటే నా చిన్నదనంలో 1961, 1962, 1963 సంవత్సరాలలో రాజమండ్రిలో జయంతి ఉత్సవాలు చేశారు. ఈ ఉత్సవాలకి ప్రారంభం ఉండేది కాని ఇన్నాళ్లు అని ఉండేది కాదు. ఈ ఉత్సవాలు వంకాయలవారి వీధిలో జరిగేవి. ఈ ఉత్సవాలలో పగటి పూజ రాత్రికి ముగిసేది. రెండవ పూజ ఏ అర్ధరాత్రికో, తెల్లవారుజామునకో ముగిసేది. ఆ తరువాత భక్తులు మాహాప్రసాదాన్ని స్వీకరించేవారు.

'మానవుడు చేసే సత్కర్మ దుష్కర్మలవల్ల మళ్ళీ మళ్ళీ జన్మ ఎత్తుతున్నాడు. ఈ జన్మ పరంపరనుండి ఉద్ధరింపబడటమే మోక్షము. ఈ అనంత విశ్వంలో ఎందరో మానవులు మనుగడ చేశారు, చేస్తున్నారు. ఇప్పుడు మనంకూడా చేస్తున్నాము. కాని ఇప్పటికి, ఎప్పటికి మానవులను నడిపిస్తున్న శక్తి(పవర్)లో మార్పు లేదు. అ శక్తి లేకపోతే ప్రపంచం లేదు. ఆ శక్తే భగవచ్ఛక్తి లేక గురు శక్తి.

అట్టి భగవత్సన్నిధానంలో, గురు సన్నిధానంలో మనకి ప్రశాంతత లభిస్తుంది. ఏ ఆలంబనం లేని మనస్సు ఆలోచనలు చేస్తుంది. సడెన్‌గా మీ మనస్సు ఎక్కడో అమెరికాలో ఉన్న మీ బంధువులను తలపుకు తేవచ్చు. వడిగా పరిగెత్తే మనస్సుకు ప్రశాంతత లభించాలంటే సత్య గురువుల సమాశ్రయం అనివార్యం.

భూత, భవిష్యద్వర్తమాన కాలాలు మూడింటిలో ఈ 'నేను' అన్నది రూప నామ క్రియా రహితంగా ఉన్నది. మానవజన్మలో పుణ్య పాపాలు అనేవి ఉన్నాయి. తాను బాధపడి అయినా ఇతరులకు మంచి జరగాలి

అనే దృక్పథంతో ఉండాలి. వివేకంతో ముందడుగు వేయాలి మన చుట్టూ ఉన్న పరిసరాలు ఎలా శుభ్రపరుచుకుంటామో, అలా మన మనస్సును శుభ్ర పరచుకోవాలి. ఈ మనస్సే మానవుని బంధ మోక్షాలకి కారణము. మనస్సు శుద్ధ మనస్సు, అశుద్ధ మనస్సు అని రెండు రకాలు. అశుద్ధమనస్సు సంకల్పాలతో కూడి ఉంటుంది. శుద్ధ మనస్సు కామ సంకల్ప వర్జితమై ఉంటుంది.

మనం ఇది మా ఆఖరిజన్మ కావాలని ప్రార్థిస్తాము. కాని మన గుణాలను మార్చుకోలేము. అవసరం లేకపోయినా అబద్ధాలు చెప్తాము. ఇప్పుడు అబద్ధాలు కూడా ఫెయిల్ అవుతున్నాయి. మన మనస్సుకు అంటిన బురదను కడుక్కోవాలి. మనస్సులో కలిగే సంకల్పాలను మనస్సుతోనే తీసివెయ్యాలి. ముల్లును ముల్లుతో తీసినటుగ్లా. ముందుగా పెద్దవారు తమ గుణాలను మార్చుకోవాలి. వారే మారనప్పుడు వారి పిల్లలకి సత్ ప్రవర్తన ఎలా కలుగుతుంది?

శ్రీ గురుదేవులను కొందరు భక్తులు 'మీరు ఎందుకు పూజలు చేస్తారు?' అని అడిగితే, శ్రీగురుదేవులు 'నేను చేస్తేనే మీరు చేయటం లేదు. నేను చేయకపోతే మీరు చేస్తారా?' అని సమాధానం ఇచ్చారు. శ్రీ గురుదేవులు మనకీ పూజలు ఎలా చేయలో నేర్పించారు.ఎలా బ్రతకాలో నేర్పించారు. అట్టి గురుదేవులు మరచినను మరపురారు. వారు నిస్సందేహంగా మహానుభావులే!

మాయను గుర్తించి మంచినే చేస్తూ గమ్యం చేరాలి. శ్రీ గురుదేవులతో గడిపిన మధురానుభూతులలో ఏదో మనస్సులో పెట్టుకుని ద్యానంలో కూర్చుంటే ధ్యానం బాగా కుదురుతుంది. ఈ జీవితం ఉండగానే భగవత్రాప్తిని పొందాలంటే దానికోసం ఆవేదన పడాలి.

శ్రీపుల్లాజీ గారు వారి శ్రీమతి లక్ష్మిగారు శ్రీ గురుదేవులను తమ పుత్రుడుగాను నన్ను తమ పుత్రికగా భావించి తమ గృహాన్ని ఆశ్రమానికి ఇచ్చిన త్యాగ మూర్తులు. శ్రీ గురుదేవుల ప్రణాళిక ప్రకారం ఈ గృహం శ్రీకాళీవనాశ్రమ శాఖగా ఈ నాడు రూపుదిద్దుకొన్నది. వచ్చే నెల అంటే జూలై 14 నుంచి జూలై25 వరకు శ్రీసద్గురు పుష్కర యాగ సత్సంగ కార్యక్రమాలు జరుగుతాయి. ఈ తేదీలతో కార్యక్రమానికి వచ్చిన భక్తులందరికీ మద్యాహ్నం 12గం30నిల. నుండి2గం.30 నిల వరకు మహా ప్రసాద వితరణ(భోజనం) ఉంటుంది. కాబట్టి భక్తులందరూ అధిక సంఖ్యలో వచ్చి ఈ కార్క్యరమాలలో పాల్గొని శ్రీ సుద్గరుదేవుల అనుగ్రహానికి పాత్రులగుదురుగాక!సుఖీభవ!!

**శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు**

**(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపు పొందిన సంస్థ)**

**అతి తక్కువ ఫీజులతో, ఉత్తమ విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'**

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్.కె.జి తో సహా టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

**ప్రత్యేకతలు**

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

సంస్కృతం మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

* ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
* క్రమశిక్షణ, సత్ ప్రవర్తన
* రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
* వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
* డేస్కాలర్స్‌కి బస్సు సౌకర్యము
* బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
* నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

350మంది అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

స్కాలర్‌షిప్‌లను పొందిన విద్యార్థులకుస్కాలర్‌షిప్‌ను డిగ్రీవరకు కొనసాగించుట 'శ్రీ చంద్రకాళీ విద్యానిధి' ప్రత్యేకత

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

గమనిక - స్కూలు ది. 2-6-2015న తెరువబడును.

వివరములకు

కరస్పాండెంట్ గారిని స్వయంగా గాని,

ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

డా॥కె.వి. ఆర్. రమణ M.Sc., Ph.D.

కరస్పాండెంట్

ఫోన్ : 0863 - 2594211(స్కూలు); 0863 - 2293824 (ఇల్లు)

మొబైల్ - 93932 20400

# సేన నహ్వీ -దేవరకొండ శేషగిరిరావు

భటుడు - సేన నహ్వీ (ఆస్థాన మంగలి) ఎక్కడున్నాడు?
సేననహ్వీ భార్య - ఎక్కడికో వెళ్ళారు. ఏం నవాబుగారు రమ్మంటున్నారా?
భటుడు -అవును. వెంటనే తీసుకెళ్ళాలి. అతడెక్కడున్నాడో చెప్పగలవా?
సేన నహ్వీ భార్య - ఎవరైనా పిలిస్తే వెళ్ళి ఉండవచ్చు. నాకూ తెలియదు.

సేన నహ్వీ భార్యకు, నవాబు సేవకులకు మధ్య జరిగిన సంభాషణ ఇది. ఆమె నవాబు సేవకులు వెళ్ళగానే తలుపులు బిగించినది. సేననహ్వీ అప్పుడు ఇంట్లోనే ఉన్నాడు. ఆ సమయంలో ధ్యానంలో ఉన్నాడు. ధ్యాన భంగం చేయకూడదని, అతని భార్య అలా అబద్ధం చెప్పింది నవాబు పరివారంతో.

అది సుమారు 1448 సం॥. మహారాష్ట్రలో కొంతభాగం తురుష్కులు జయించారు. నేటి బీదర్‌లో ఒక నవాబు ఉండేవాడు. అతిని కొలువులో సేననహ్వీ మంగలి పనిచేస్తూ ఉండేవాడు. రాజు కొలువులో తన పని పూర్తి చేసుకుని మిగిలిన సమయం అంతా కీర్తనలతో గడిపేవాడు. ప్రొద్దునే స్నానం, పూజ చేసుకుంటేనే గాని గడప దాటేవాడు కాదు. అది అతడి నియమం.

రాజ భవనంలో చెప్పుడు మాటలతో అవతలివారి మనస్సు విరిచే క్రూర స్వభావం గల ఆసామీ ఒకడున్నాడు. పై సంఘటన తరువాత అతడు నవాబుతో "జహాపనా! ఇంట్లో ఉండికూడా లేడనిపించాడు సేన చూశారా! అతని భార్య అబద్ధమాడింది. ఆ సమయంలో అతడు ధ్యానం చేస్తూ ఉంటాడు. మళ్ళీ మనిషిని పంపించి అతన్ని రప్పించండి" అన్నాడు.

ఈ మాటలు విన్న నవాబు కోపోద్రిక్తుడయ్యాడు. రాజభటులను పిలిచి, 'అతడు ఏ స్థితిలో ఉన్నా సరే, జబ్బ పుచ్చుకుని తీసుకురండి' అని ఆజ్ఞాపించాడు. అదే సమయంలో సేనుణ్ణి రక్షించే నిమిత్తం పాండు రంగడు సేనుడి రూపం ధరించి వచ్చాడు. రాజద్వారం దగ్గర నిలబడ్డ ద్వారపాలకుడు గబగబా వచ్చి 'సేనుడు వచ్చాడు' అని చెప్పాడు. సేనుణ్ణి చూసి నవాబు భటులను ఆపాడు. ఇతణ్ణి చూడగానే శాంతుడయ్యాడు.

నవాబు తల అంటడానికి సేనుడు నూనె తలపై రాశాడు. నవాబు ఎదురుగా నూనె గిన్నె ఉంది. ఆ గిన్నెలో సేనుడి ప్రతిబింబం నవాబుకు చిత్రంగా కనిపించింది. నాలుగు చేతులున్న కృష్ణుడి విగ్రహం కనిపించింది. సేనుడి వైపు తిరిగి చూస్తే అతని రూపం మామూలుగానే ఉంది. మళ్ళీ నూనెలో చూస్తే శంఖ - చక్ర - గదా - పద్మ హస్తుడైన

మాధవ రూపం కనిపిస్తోంది.

చూసిన కొద్దీ ఈ చిత్రంలోని రహస్యం నవాబుకు అంతుబట్టటం లేదు. నవాబు అమితానందంతో సేనుడి రూపంలో ఉన్న పాండురంగడికి బంగారు నాణాలు ఇచ్చాడు. పాండు రంగడు సేనుడి ఇంటికి వచ్చి అతని సంచీలో ఆ నాణేలు ఉంచి అదృశ్యం అయ్యాడు.

మరల మధ్యాహ్నం కావస్తుండగా నవాబు సేనునికై మళ్లీ కబురు పంపాడు. సేనుడు గబగబా తన సామాగ్రితో బయలుదేరుతుండగా సంచీలో ఉన్న బంగారు నాణేలు చూసి బిత్తరపోయాడు. తన సంచీలోకి అవి ఎలా వచ్చాయో అర్థం కాకపోయినా, ఆలస్యం అవుతోందని ఆ విషయాన్ని వదిలి ఆస్థానానికి వెళ్లాడు. అక్కడ నవాబుని మళ్లీ తలంటుకి సిద్ధం చేశారు. సేనానహ్వి గబగబా తన పని ప్రారంభించి, నవాబుకు నూనె రాయటం ప్రారంభించాడు. నవాబుకి ఈసారి నూనెలో మాధవుడు కనబడలేదు. వట్టి సేనుడి ప్రతిబింబమే కనబడింది. 'ప్రొద్దున చూసిన విష్ణుప్రతిబింబం కనబడటం లేదేమి? దానిని నాకు చూపించు' అని నవాబు సేనుని అడిగాడు.

'విష్ణు ప్రతిబింబమేమిటి? నేను చూపించటమేమిటి? నేనసలు ప్రొద్దుట రాలేదు కదా! ఇదేదో చిత్రంగా ఉందే! ఈ నవాబుకు పిచ్చి పట్టిందా ఏమిటి?' అని సేనుడు మనస్సులో అనుకున్నాడు. ఎలాగో ధైర్యం తెచ్చుకుని 'తమరు మాట్లాడుతున్నది నాకు అర్థం కావటం లేదు' అన్నాడు సేనుడు. అప్పుడు నవాబు ఉదయం జరిగినదంతా చెప్పాడు. అప్పుడు సేనుడు ఇదంతా పాండురంగడి లీల! అని గ్రహించి, చేతులు జోడించి రంగణ్ణి 'నీ చతుర్భుజ రూపం మరల నవాబుకి చూపించు' అని మనసారా ప్రార్థించాడు. ఆ రూపం తిరిగి నూనెలో నవాబుకు కనిపించింది.

సేనానహ్వి మామూలు మంగలియా! కానేకాదు. కత్తి పదును వంటి వివేకం కలవాడు. తన పనిలోనే భగవతత్త్వాన్ని గాంచిన వాడు. చేత పట్టిన అద్దం, విశ్వమనే ప్రతిబింబాన్ని చూపేది. బింబమే సత్యమని, ప్రతిబింబం అబద్ధమని ఈ జగత్తుకు నిత్యసత్యత్వం లేదని చూపించేదే అద్దం. చేతులతో శరీరాన్ని మర్థించటం మానవునిలోనే కామ క్రోధాదులను ఒత్తడమే. నెత్తిపై నీళ్ళు చల్లడం శాంతికి సంకేతం. జుట్టు వెంట్రుకలు కత్తిరించటం ప్రపంచంతో మమేక భావాన్ని త్రుంపడమే!

# సత్సంగామృతం

(గత సంచిక తరువాయి) - మురళీ

అర్జునుడికి మోహం ఎలా నశించింది? కృష్ణుని సన్నిధిలో, కృష్ణుని యొక్క సంభాషణచేత, వారి బోధామృతం చేత నశించింది. 'కృష్ణా! నీ అనుగ్రహంతో జ్ఞానాన్ని పొందాను నా మోహం నశించింది' అన్నాడు అర్జునుడు. మన మోహం నశించాలంటే ఎలా? ప్రపంచంలో జరిగే విషయాలన్నీ చూస్తుంటే మోహం ఎక్కువ అవుతుందే కాని నశించదు. కలలో కూడా ఈ ప్రపంచాన్ని నిజం అనుకోకు. ఈ వాస్తవాన్ని నువ్వు ఎప్పుడూ విచారణ చేస్తూనే ఉండాలి. ఇది మాయ అనుకుంటే సరిపోదు. విచారణ చేస్తూనే ఉండాలి.



ప్రతి వస్తువు నందు, ప్రతి అణువు నందు నీవు విచారణ కలిగి ఉండాలి. అప్పుడే ఏది నశించేది, ఏది నాశ రహితమైనది అనే విషయం మనకు అనుభవానికి వస్తుంది.

ఆకాశంలో ఉండే చంద్రుడే క్రిందన ఉన్న అనేక నీటి కుండలలో ప్రతిబింబిస్తున్నాడు. కాని అనేక మంది చంద్రులు లేరు అనే విషయాన్ని గుర్తించటమే విచారణ.

జన్మజన్మల నుండి తెచ్చుకున్న అనేక వాసనలు మనస్సుకు అడ్డుపడుతున్నాయి. నువ్వు విచారణ వలనే ఆ వాసనలు రహితం అవుతాయి. అందువలన తప్పక విచారణ చేయాలి.

గురుదేవులు తమ బోధామృతంలో చెప్పారు. గురువాణిలో కూడా ఉంది. ఏమని? నువ్వు ధ్యానం చెయ్యి. ధ్యానం ముఖ్యం. ధ్యానం కంటె విచారణ ఇంకా ముఖ్యం. విచారణ వేరు, ధ్యానం వేరు కాదు. ధ్యానమందు ఏకాగ్రత కావాలంటే విచారణ చెయ్యాలి. ఈ ప్రపంచం

అశాశ్వతం అన్న జ్ఞానం విచారణ ద్వారా వస్తుంది. కొంతమంది నాకు విచారణ చేయటానికి ఎవరూ దొరకటం లేదండి అంటారు. ఎవరో రానవసరం లేదు. దాహం కలిగి ఉంటే మంచినీళ్ళు త్రాగుతాం. గ్లాసుతో ఏమిటి కుండతో ఇచ్చినా స్వీకరిస్తాం. ఆకలిగొన్న వారికి బంగారు పళ్ళెంలో అన్నం పెట్టారా, దేనిలో పెట్టారు అన్నది కాదు, ఆకలికి కావలసినది అన్నం. ఆకలితో ఉన్నవారు దేనిలో పెట్టినా సంతోషంగా స్వీకరిస్తారు. అదేవిధంగా గురుబోధను విచారణలోకి తెచ్చుకోవాలి.

గురుదేవులు అపారమైన ప్రేమ చూపించారు. ఎన్నో అనుభవాలను ఇచ్చారు. వాటిలో ఏ ఒక్కదానినైనా ముద్రగా చేసుకుని ధ్యానం చేయాలి. అప్పుడు ఏకాగ్రత కుదురుతుంది. ఇతరమైన విషయాదుల వైపు మనస్సు పరుగెత్తదు.

శివునికి భావనతో అభిషేకం చేస్తే సంతృప్తి. ఆయన భోళా శంకరుడు. కాసిని నీళ్ళు చేస్తే చాలు సంతోషపడిపోతాడు ఆయన ముఖం, కళ్ళు, చెవులు వంటి వాటికోసం వెతుక్కోనవసరం లేదు. శివలింగాన్ని మనస్సులో నిలిపితే చాలు. ధ్యానానికి ముద్ర చాలా బాగుంటుంది.

భగవంతుడు అందనివాడు కాదు. అందరివాడు. భవగంతుడు నా వాడు, నావాడు అనుకోవాలి. అలాగే గురుదేవులు నావారు అనుకోవాలి. గురుపాదం సర్వవ్యాపకం అనే భావన కలగాలి. గురుదేవుల యొక్క జగన్మాత తత్త్వం తెలుసుకోవాలి.

అట్టి అనుభవాన్ని పొందటమే మన గమ్యం. అదే స్మృతి.

'త్వమేవ మాతాచ పితా త్వమేవ, త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ .... త్వమేవ సర్వం మమదేవ' అనేది మంత్రం లాగా చదివేస్తే ఫలితం అలాగే ఉంటుంది. మనస్సు పెట్టి చదివితే దాని ఫలితం అమోఘం!

- సశేషం

## గోదావరి పుష్కరాల సందర్భంగా
## ఆశ్రమ రాజమండ్రి శాఖ కార్యక్రమ వివరాలు

గోదావరి పుష్కరాల సందర్భంగా 14-7-15 మంగళవారం నుండి 25-7-15 శనివారం వరకు ఆశ్రమం రాజమండ్రి శాఖలో హోమం, సత్సంగం, సామూహిక పూజలు, భక్తసమారాధన ఏర్పాటు చేయబడినవి. పుష్కర స్నానమునకు రాజమండ్రి వచ్చే భక్తులు ఆశ్రమ శాఖను దర్శించి, కార్యక్రమములో పాల్గొనగలరని ఆశిస్తున్నాము.

నిత్యకార్యక్రమాలు -

<u>తెల్లవారుజాము</u>

3గం. - 4గం. వరకు పుష్కర స్నానం.

4గం. - 4-30ని॥ వరకు మేలుకొలుపు, సుప్రభాతం.

4-30 ని॥ - 6గం. వరకు ధ్యానము, ప్రార్థన.

<u>ఉదయం</u>

8గం. - 10 గం. వరకు హోమం,

10గం. - 11-30ని॥ వరకు శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనం.

11గం. - 12-30ని॥ వరకు శ్రీమాతాజీ మరియు మహాత్ముల ప్రవచనం.

<u>మధ్యాహ్నం</u>

12-30ని॥ నుండి 2-30ని॥ వరకు పుష్కర యాత్రికులకు మహాప్రసాదం.

<u>సాయంత్రం</u>

5గం.-6.30ని॥ వరకు శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనం.

6.30ని॥ - 7.30ని॥ వరకు శ్రీమాతాజీ మరియు మహాత్ముల ప్రవచనం.

<u>రాత్రి</u>

7.30ని॥ - 8.30ని॥ల వరకు మహామంగళ హారతి, దర్బారు.

విశేష కార్యక్రమాలు

17-7-15 శుక్రవారం : సామూహిక కుంకుమ పూజలు.

19-7-15 ఆదివారం : మహాసంకల్పముతో శ్రీసద్గురు పుష్కర స్నానములు.

21-7-15 మంగళవారం : శ్రీ ఆంజనేయ స్వామి పూజలు.

24-7-15 శుక్రవారం : సామూహిక కుంకుమ పూజలు.

25-7-15 శనివారం : శ్రీసద్గురుపాదపూజ, మహామంగళ హారతి.

గమనిక -

ఆశ్రమశాఖలో నిద్ర చేయుటకు వసతి లేదు. ఎవరి సదుపాయం వారే ఏర్పరచుకొనవలెను. కార్యక్రమాలలో సమయానుకూలంగా మార్పులు, చేర్పులు ఉండవచ్చు. దయతో సహకరించ వలెను.

# సర్వం విష్ణుమయం జగత్

(శ్రీరామకృష్ణుల గూడార్థ కథల నుండి)

ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థితులను అందుకున్న సాధుపుంగవుల ప్రవర్తనల గురించి వివరిస్తూ శ్రీరామకృష్ణులు ఈ ఉదంతాలను చెప్పారు....

"ఒకసారి దివ్య పారవశ్య స్థితిలో ఉన్న ఒక సాధువు దక్షిణేశ్వరం వచ్చాడు. ఒకరోజు అతనికి ఆహారం లభించలేదు. ఆకలి వేస్తున్నా ఎవరినీ అడగలేదు. మూల పారవేసిన ఆహారాన్ని ఒక కుక్క తింటుంటే దాని దగ్గరకు వెళ్ళి 'సోదరా! నాకు పెట్టకుండా నీవొక్కడివే తింటున్నావా?' అని దానితో కలిసి కూర్చుని తినసాగాడు. ఆ కుక్క కూడా ఏమీ అభ్యంతర పెట్టలేదు. అటువంటి విచిత్రరీతిలో తన భోజనాన్ని పూర్తిచేసుకుని, కాళీకాలయంలో ప్రవేశించి, అమ్మవారిని స్తోత్రం చేశాడు.

అతడు ఎంత భక్తిగా స్తోత్రం చేశాడంటే, ఆ ఆలయమే కంపించి పోయింది. అతడు అలా స్తోత్రాన్ని ముగించి వెళ్ళబోయే సమయంలో నేను హృదయుణ్ణి పంపించి, అతను ఏం చెబుతాడో తెలుసుకుని, నాతో చెప్పమన్నాను.

హృదయుడు అతడిని అనుసరించి పోసాగాడు. కొంతదూరం పోయాక అతను వెనక్కి తిరిగి, 'ఎందుకు నన్ను వెంబడిస్తున్నావు?' అని హృదయుణ్ణి అడిగాడు. హృదయుడు 'స్వామీ! నాకేదైనా బోధించండి' అన్నాడు. అతడు మాట్లాడుతూ 'ఈ మురుగు కాలవలోని నీరు, ఆ గంగా నదిలోని నీరు నీకు ఒకేలా కనబడినప్పుడు; ఈ వేణునాదానికీ, ఆ రణగొణ ధ్వనికీ నీకు తేడా కనిపించనప్పుడు నీకు నిజమైన జ్ఞానం కలిగిందని తెలుసుకోవచ్చు' అని చెప్పి, అక్కడి నుంచి గబగబా వెళ్ళి

పోయాడు. హృదయుడు తిరిగి వచ్చి వారిద్దరికీ జరిగిన సంభాషణ నాతో చెప్పినప్పుడు, 'అతడు నిజమైన జ్ఞానాన్ని పొందాడ'ని నేను హృదయుడితో చెప్పాను. అటువంటి జ్ఞానులు కొన్నిసార్లు నిష్కపటమైన చిన్నపిల్లలలాగ, కొన్నిసార్లు శవాలను పీక్కుతినే భూతాలలాగ, కొన్నిసార్లు పిచ్చివాళ్ళలాగ ప్రవర్తిస్తారు. అటువంటి స్థితిని వివరిస్తూ ఈ కథను చెప్పారు......

"మరొక సాధువు ఉండేవాడు. అతడు ఎప్పుడూ పారవశ్య స్థితిలో ఉండేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. జనం అతడొక పిచ్చివాడని భావించేవారు. ఒకరోజు గ్రామంలో కొంత ఆహారాన్ని బిచ్చమెత్తుకుని తెచ్చి, ఒక కుక్క ప్రక్కనే కూర్చుని, దానిమీద చెయ్యి వేసి, దానితో పంచుకుని తినసాగాడు. ఇది ఒక విచిత్రమైన దృశ్యానికి దారితీసింది.

ఆ సాధువు ఒక ముద్ద తాను తింటూ, రెండవ ముద్ద ఆ కుక్కకు తినిపించసాగాడు. ఇద్దరు స్నేహితులు కలిసి తింటున్నట్లుగా ఆ కుక్కతో కలిసి తినసాగాడు. అక్కడ జేరిన జనం ఇది చూసి నవ్వసాగారు. అతడు వారితో .....

విష్ణూపరి స్థితో విష్ణుః । విష్ణుం ఖాదయతి విష్ణుః ।
కథం హససి రే విష్ణో ! సర్వం విష్ణుమయం జగత్ ॥

ఓ విష్ణు స్వరూపులారా! మీరు ఎందుకు అలా నవ్వుతున్నారు? ఒక విష్ణువు మరొక విష్ణువుతో కూర్చున్నాడు. ఒక విష్ణువు మరొక విష్ణువుకు తినిపిస్తున్నాడు. సర్వమూ విష్ణుమయమే కదా!' అని ఆ సాధువువారితో అన్నాడు.

"అందరిలోనూ భగవంతుణ్ణి చూడటమనే ఈ అత్యున్నత స్థితి అందరికీ కలిగేది కాదు."

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

## నిండ్రకొలను డాక్టరుగారితో శ్రీబాబు

నిండ్రకొలను డాక్టరుగారికి ఒకప్పుడు చాల ప్రమాదకరమైన జబ్బు చేసింది. వైద్యానికి భీమవరం తీసుకువెళ్ళారు. అక్కడి వైద్యులు పెదవి విరిచారు. డాక్టరుగారు నిర్జీవులయ్యారు. శరీరం మంచువలె చల్లబడిపోయింది. చీమలు పట్టడం ప్రారంభ మయింది. భక్తులందరి మనస్సులో 'బాబు' స్మరణ మొదలౌతోంది. తదితర బంధువులందరూ 'తరువాత ఏర్పాట్లు' మొదలుపెట్టారు. అంతలో ఎవరో 'శ్రీబాబు దిరుసుమర్రులో ఉన్నారు' అని కబురు అందించారు. అర్థరాత్రి. కారుచీకటి. కాలువ గట్టుమీదనే ప్రయాణం. అయినా ఒక యువకుడు ముందుకు వచ్చి, సైకిల్‌పై అతి వేగంతో చీకటిలో



యిరుకైన కాలవగట్టుపై ప్రయాణం ప్రమాదభరితమైనా సరే, లెక్కచేయక దిరుసుమర్రు వెళ్ళి శ్రీబాబుకు కబురు అందించాడు.

శ్రీబాబు భీమవరంలో ఆసుపత్రికి చేరేసరికి డాక్టరుగారి కళేబరం మీద చీమలు ప్రాకుతున్నాయి. శ్రీబాబు ముందుగా తడిగుడ్డతో డాక్టరుగారి శరీరం తుడిపించి, కొబ్బరికాయ దిష్టి తీసి, జగన్మాత పూజ తీర్థం నోటిలో పోశారు. రెండసార్లు దిగలేదు కాని మూడవసారి గుటక పడింది! డాక్టరుగారు పునర్జీవితులయ్యారు!!

శ్రీబాబుతో నిండ్రకొలను డాక్టరుగారు అనేక తీర్థయాత్రలు చేశారు. 1966లో జరిగిన ఉత్తరయాత్ర బదరీనాద్‌లో శ్రీబాబు, డాక్టరు గారు, తారకంగారు 'విష్ణుపాదాలు' ఉండే చోటుకి వెళ్ళారు. అక్కడ విష్ణు పాదాలను పట్టుకుని వదలలేక డాక్టరుగారు శ్రీబాబుతో 'నేనిక్కడే ఉండి పోతాను బాబూ!' అని ప్రార్థించారు. శ్రీబాబు వారిని అనునయిస్తూ తప్పకుండా నీ కోరిక నెరవేరుతుంది. కాని ఇప్పుడే కాదు. నీ కర్తవ్యం ఇంకా కొంత మిగిలి ఉంది' వారిని వెనుకకు మరలించారు.

డాక్టరుగారు తిరిగి వచ్చాక వారి మనస్సు పూర్తిగా ప్రపంచం నుండి మరలి నివృత్తి మార్గంలో నెలకొన్నది. ఒకనాడు రంగులు వేసే కుంచెతో తమ వాకిటి గుమ్మం మీద 'యంత్ర శకటము శిథిలం కాక మునుపే గమ్యస్థానం చేరవలెను' అని రంగుతో వ్రాసుకున్నారు. అది వారు తనము ఉద్దేశించుకుని వ్రాసిన వాక్యమే అయినా, అది ప్రతి మానవునికి తన కర్తవ్యమును భవిష్యత్తును గూర్చి చేసిన హెచ్చరికే అయింది. అలా వ్రాసిన అనతి కాలంలోనే, ఒకనాటి రాత్రి నింద్రకొలను డాక్టరుగారు ఇంటిని, ఇల్లాలిని, సంసారాన్ని, సర్వస్వాన్ని వదులుకుని ఎక్కడికో వెళ్ళిపోయారు, మళ్ళీ తిరిగి రాలేదు.

- సశేషం

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జులై 2015

2 గురు అధిక ఆషాఢపూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

11 శనివారం శ్రీగురుదశమి

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

31 శుక్రవారం నిజ ఆషాఢపూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

ఆగస్ట్ 2015

9-8-15 ఆదివారం, శ్రీగురుదశమి.

ఉదయం 11గం.లకు సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, మహాప్రసాదం.

29-8-15 శనివారం రాఖీ పూర్ణిమ

సాయంత్రం 5గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, మహాప్రసాదం.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

-గత సంచిక తరువాయి

# విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

## కబీర్‌దాస్

కాశీనగరంలో ఒక ధనికుడు ఉండేవాడు. అతనికి దైవచింతనయే గిట్టదు. గంగానదీ తీరంలో కబీర్ శిష్యులకు బోధిస్తుంటే ఆ ధనికుడు వచ్చి కబీర్‌ను అహంకారంతో అనరాని మాటలనేవాడు. "కాలాన్ని వృధా చేసుకునే పిచ్చి సన్యాసులు" అనేవాడు. కబీర్ ఆ ధనికుడితో "నీవు చేసిన వ్యాఖ్యలు బాగానే ఉన్నాయి. నువ్వు అక్రమంగా ఇంత ధనాన్ని కూడ బెట్టావు. నిన్ను ఎవరైనా ఆదుకుంటారా? నీ బాధలను పంచుకుంటారా?" అని ప్రశ్నించాడు.




"నన్ను ప్రాణసమానంగా చూసుకొనే వారెందరో ఉన్నారు. నా భార్యా పిల్లలు అవసరమైతే ప్రాణాన్ని ఇవ్వటానికైనా వెనుకాడరు" అన్నాడు ఆ షావుకారు. "మిత్రమా! నీ మాటలు సత్యదూరంగా ఉన్నాయి. ఇందులో సత్యమెంతో గ్రహించాలంటే నువ్వు జ్వరపీడితుడవై నట్లుగా నటించు. నిన్ను ప్రేమించేవారు నీకు ఎందరున్నారో తెలిపోతుంది" అన్నాడు కబీర్.

షావుకారు సమ్మతించి బాధపడుతున్నవాడిలా నటిస్తూ ఇంట్లో పడుకున్నాడు. బంధువులంతా చుట్టుముట్టారు. లేని జబ్బు కనుక ఎంత వైద్యం చేసినా నయం కావటం లేదు. పరిస్థితి విషమించింది. ఇక బ్రతకడు అని నిర్ణయానికి వచ్చారు.

"ఏమండీ! మీ తర్వాత నన్ను బాగా ఎవరు చూసుకుంటారు? పిల్లలు నా మాట వింటారనే నమ్మకం ఏముంది? దయ ఉంచి ఆస్థి నా పేరున వ్రాయండి" అని భార్య విలపించింది.

"నాన్నా! ఇంటికి పెద్ద వాడిని కనుక ఆస్తి నా పేరిట వ్రాయండి. మీ చితా భస్మాన్ని పుణ్యనదులలో కలపవలసిన వాడను నేనే కదా!" అన్నాడు పెద్దకొడుకు. "నాన్నా! నేను అందరిలో చిన్నవాడను. మీ ముద్దుల కొడుకుని. పెద్దవాళ్ళు నన్ను మోసం చేయవచ్చు. ఆస్థి నా పేరున వ్రాయండి.

ప్రతి ఏటా మీ పేరున బ్రాహ్మణులకు సంతర్పణ చేస్తాను" అన్నాడు చిన్న కుమారుడు.

షావుకారు బంధువులంతా అక్కడే నుంచుని ఉన్న కబీర్‌దాస్‌తో "మహాత్మా! మీరు భగవత్స్వరూపులు. ఎలాగైనా ఇతనిని బ్రతికించండి" అని ప్రాధేయపడ్డారు. కబీర్‌దాస్ సరేనని ఒక గిన్నెతో పాలు తెప్పించి" ఎవరైతే ఇతనిని అమితంగా ప్రేమిస్తున్నారో, వారు ఈ పాలు త్రాగితే ఇతని జబ్బు నయమవుతుంది. అన్నాడు. అందరూ నేనంటే నేను త్రాగుతాను అంటూ ముందుకు వచ్చారు.

కబీర్ "ఆగండి! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. ఎవరైతే ఈ పాలు త్రాగుతారో వారు మరణిస్తారు. ఈ షావుకారు బ్రతుకుతాడు" అన్నాడు.

"నేను చనిపోతే పిల్లల బాధ్యత ఎవరు తీసుకుంటారు?" అని వెనుకడుగు వేసింది భార్య.

"నాకు భార్యా పిల్లలు ఉన్నారు. నేను గతిస్తే వారి జీవితాలు ఏమవుతాయి?" అని వైదొలగాడు పెద్ద కుమారుడు.

"నేను మరణిస్తే నా భార్య జీవించలేదు. అనవసరంగా రెండు హత్యలు అవుతాయి" అని తప్పుకున్నాడు రెండవ కుమారుడు.

"తన కుటుంబీకులే కాదంటూ ఉంటే మాకు మాత్రం ఏం పట్టింది?" అన్నారు బంధుమిత్రులు.

అందరూ కబీర్ వైపు తిరిగి "మహాత్మా! మీరు నిస్వార్థ పరులు. త్యాగజీవులు. దయఉంచి మీరు ఈ పాలను త్రాగి షావుకారుని రక్షించండి? తోటి ప్రాణికి సేవ చేయటమే కదా మీ ధర్మం" అన్నారు.

కబీర్‌దాస్ నవ్వుతూ "అలాగే, నేనే త్రాగుతాను" అని ఆ పాలు త్రాగి షావుకారుని పడకమీద నుంచి లేపాడు. ధనికుడు లేచి సిగ్గుతో తలవంచుకున్నాడు. ఎవరికోసమైతే తాను అమితంగా కష్టించి ధనాన్ని కూడబెట్టాడో" వారి ప్రేమలు ఎలాంటివో ప్రత్యక్షంగా చూశాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL